


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 82 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | శుక్రవారం 28 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :82 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | FRI 28 NOVEMBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ధాన్యం కొనుగోలు వేగవంతం చేశాం...

### దళారులను నమ్మి మోసపోవద్దు

- రాష్ట్రంలో ఇప్పటివరకు 8.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లోకి ఇప్పటికే రూ. 1713 కోట్లు జమ
- ధాన్యం కొనుగోలు చేసిన 4-6 గంటల్లోనే నగదు చెల్లింపు
- గత ప్రభుత్వ బకాయిలు రూ. 1674 కోట్లు చెల్లించిన కూటమి సర్కార్
- దళారులపై రైతులను అప్రమత్తం చేసిన మంత్రి నాదెండ్ల



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. గురువారం విజయవాడలోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నేటి వరకు 8,22,000 మెట్రిక్

వివరాలు 2లో..

## శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు... టీటీడీపై సీఎం చంద్రబాబు సమీక్ష



- నలుదిశలా తిరుమల ఆధ్యాత్మిక వైభవాన్ని చాటాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో తిరుమల తరహా విధానాలు అమలు చేయాలని సూచన
- వైద్య నిపుణులను శ్రీవారి సేవకులుగా ఆహ్వానించి సేవలు వినియోగించుకోవాలని దిశానిర్దేశం
- వైకుంఠ ఏకాదశికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని టీటీడీకి స్పష్టం
- పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ, కొత్త ఆలయాల నిర్మాణంపై ప్రత్యేక ప్రణాళిక

వివరాలు 2లో..



## స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను...

# ఎవరినీ చేయనివ్వను

- అమరావతిలో శ్రీవారి ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన
- రూ.260 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి ప్రణాళిక
- రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని టీటీడీకి సీఎం ఆదేశం
- రాజధానికి భూములిచ్చిన రైతులకు చంద్రబాబు ధన్యవాదాలు
- గత ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి ఆటంకాలు కలిగాయని వ్యాఖ్య




పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతిలోని వెంకటపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ.260 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆలయ విస్తరణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ బృహత్తర కార్యాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజధాని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ విస్తరణ పనులను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. తొలి దశలో రూ.140 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ వంటి నిర్మాణాలు చేపడతారు. ఇక రెండో దశలో రూ.120 కోట్లతో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, భారీ అన్నదాన సముదాయం, యాత్రికుల విశ్రాంతి భవనాలు,

వివరాలు 2లో..

## బంగాళాఖాతంలో 'దిట్వా' తుపాను...

- శనివారం నాటికి దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంపై ప్రభావం చూపే సూచన
- తమిళనాడులో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక
- ప్రధాన పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ.. మత్స్యకారులు అప్రమత్తం




పెన్ పవర్ డెస్క్:నైరుతి బంగాళాఖాతంలో, శ్రీలంక తీరానికి సమీపంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ గురువారం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది గురువారం సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

వివరాలు 2లో..

## ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే



- ఆన్‌లైన్ కంటెంట్‌కు జవాబుదారీతనం తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు
- సొంత ఛానల్ ఉందని బాధ్యతారాహిత్యంగా ఉండటం సరికాదని కీలక వ్యాఖ్యలు
- యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా వివాదంపై విచారణ
- వినియోగదారుల కంటెంట్ నియంత్రణపై కేంద్రానికి ఆదేశాలు
- నిబంధనల రూపకల్పనకు నాలుగు వారాల గడువు

వివరాలు 2లో..

## పవన్ కల్యాణ్‌వి తెలివితక్కువ మాటలు



- కోనసీమకు తెలంగాణ నేతల దిష్టి తగిలిందన్న పవన్ కల్యాణ్
- పవన్‌వి తెలివితక్కువ మాటలంటూ జగదీష్ రెడ్డి కౌంటర్
- మా దిష్టి కాదు, ఏపీ వాళ్ల దిష్టే హైదరాబాద్‌కు తగిలిందన్న జగదీశ్
- మెదడు వాడకుండా మాట్లాడేవాళ్లు డిప్యూటీ సీఎంలయ్యారంటూ విమర్శ
- రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపిన 'దిష్టి' వ్యాఖ్యలు

వివరాలు 2లో..

## ప్రపంచానికే ఆదర్శం మన యువత..

# వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది

- భారత జెన్-జెడ్ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు
- వారి ఆత్మవిశ్వాసం ప్రపంచానికే ఆదర్శమన్న ప్రధాని
- అంతరిక్ష రంగంలో 300కు పైగా స్టార్టప్‌ల ఏర్పాటు
- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌లతో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- యాప్‌ల నుంచి డీప్-టెక్ వైపు యువత అడుగులు

పెన్ పవర్ డెస్క్:భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-I'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా

వివరాలు 2లో..



## స్వామివారి విషయంలో ఏ తప్పు చేయలేదు..

# పాలీగ్రాఫ్ టెస్టుకు నేను సిద్ధం

- శ్రీవారి లడ్డూ నెయ్యి వివాదంపై స్పందించిన వైవీ సుబ్బారెడ్డి
- పాలీగ్రాఫ్ పరీక్షకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టీకరణ
- ఆలయాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపణ
- సిట్ దర్యాప్తు జరుగుతుండగా తప్పుడు ప్రచారం తగదని మీడియాకు హితవు

వివరాలు 2లో..



## మతం ఏదైనా మానవత్వం

# మర్చిపోకూడదు

- మంగళగిరిలో నూర్ మసీద్‌ను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- మతం కంటే మానవత్వమే గొప్పదని కీలక వ్యాఖ్యలు
- భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపు
- రాష్ట్ర, దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచన



పెన్ పవర్ డెస్క్:మతం ఏదైనా మానవత్వాన్ని ఎన్నడూ మరవకూడదని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువత భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన

వివరాలు 2లో..




# అమరావతికి చట్టబద్ధతుఅనిశ్చితి నుండి భవిష్యత్తు నిర్మాణంకు

అమరావతి రాజధాని ప్రశ్న ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఎంతకాలం వెంటాడిందో చెప్పడం కష్టం. రాజకీయాల అస్తవ్యస్త గమనంలో, ప్రజల ఆశలుఆందోళనలుఅసహనాలు అనిశ్చితి అన్నీ కలిసిపోయి ఒక భావోద్వేగ తుఫానుగా మారిన విషయం అందరికీ తెలిసిందే. రాజధాని అంటే కేవలం ఒక ప్రదేశం కాదుబీ అది ఆ రాష్ట్ర పునర్నిర్మాణ యాత్రకు తొలి అడుగు, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక, భవిష్యత్ తరాలకు ఇచ్చే హామీ. ఈ నేపథ్యంలో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు చేపట్టిన చర్యలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లోకంలో కొత్త వెలుగుదీపంలా మెరవడం సహజం.

**అయోమయానికి తెరదించే చట్టబద్ధత**

డిసెంబర్ పార్లమెంటు సమావేశాల్లో "అమరావతి రాజధాని బిల్లు" ప్రవేశపెట్టబడబోతున్నది అన్న సంకేతాలు రాష్ట్రవ్యాప్తంగా ఆశ కిరణాలను విస్తరించాయి. ఎన్నేళ్లుగా కొనసాగుతున్న అనిశ్చితి వాతావరణయిపెట్టుబడిదారుల్లో అభద్రతురైతుల్లో భయయిప్రజల్లో కలత ఇవన్నీ చట్టపరమైన రక్షణ రూపంలో తొలగిపోయే అవకాశం కనిపిస్తోంది. శాశ్వత రాజధాని చట్టబద్ధత పొందడం అనేది కేవలం పరిపాలనా నిర్ణయం కాదుబీ అది ప్రజల మనోవ్యథలకు ఓదార్పు, వారి నమ్మకానికి మళ్ళీ బలమిచ్చే రాజకీయ నీతి.

**రైతుల త్యాగాలకు గౌరవం**

అమరావతి పేరును ప్రస్తావించినప్పుడు తొలి గుర్తుకు వచ్చేది రైతులే. తమ భూములను వ్యక్తిగత ఆస్తిగా కాక, రాష్ట్ర నిర్మాణానికి పునాది రాయిగా సమర్పించిన వారు ఏం అనుభవించారో ఆకాశానికే తెలుసు. మూడు రాజధానుల ప్రతిపాదన వారి త్యాగాలను ప్రశ్నార్థకంలో నిలబెట్టి, ఆశల్ని మబ్బులా చుట్టేసింది. అయినా వారు వెనకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యంలో "అధికారమే కాదుఅధికారం తీసుకునే నీతీ ఉండాలి" అనే భావాన్ని

**వారి పోరాటం గుర్తు చేసింది.**

అమరావతి బిల్లుతో కేంద్రం వారి త్యాగాలకు చట్టరూపం ఇస్తోంది. ఇది రైతుల విజయమే కాదుబీ రాష్ట్ర ఆత్మ విశ్వాసం తిరిగి పుట్టుకొస్తున్న క్షణం.

**రాజకీయ స్థిరత్వానికి చట్టమే బలమైన అండ**

గత దశాబ్దం ఏపీలో పెట్టుబడులకు అత్యంత గండికొట్టిన అంశం 'రాజధాని మార్పు' అనే పదమే. దాని ప్రభావం పరిశ్రమల నుంచి విద్యాసంస్థల వరకు ప్రతి రంగాన్ని తాకింది. రాష్ట్రానికి ఎంచుకున్న దారి ఎప్పుడైనా ఒక రాజకీయ నిర్ణయంతో మారిపోతుందన్న భయం నిరుద్యోగం, పెట్టుబడుల కొరత, అవిశ్వాసయిఅన్నింటికి దారితీసింది.

**ఈ నేపథ్యంలో అమరావతికి చట్టబద్ధత ఇవ్వడం అనేది:**

- పరిపాలనకు స్థిరత్వం
- పెట్టుబడిదారులకు భరోసా
- రాష్ట్రానికి దీర్ఘకాల దృష్టి
- అభివృద్ధికి వేగం

అని చెప్పాలి.

**అరుదైన కానీ అత్యవసరమైన చట్ట గుర్తింపు**

దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ రాష్ట్ర రాజధానికీ ప్రత్యేక చట్టబద్ధ గుర్తింపు ఇవ్వలేదు. అమరావతికి ఆ గౌరవం దక్కబోతున్నది అంటే అది కేవలం రాజ్యపాలనా విషయం కాదు ఇది ప్రజాబలాన్ని, రైతుల నిబద్ధతను, రాష్ట్ర ఆత్మస్థైర్యాన్ని గుర్తించిన నిర్ణయం.

**ఇది రాజధానికి "శాశ్వత బీమా".**

ఇది భవిష్యత్తు రాజకీయాలు రాజధానిని వాడుకునే అవకాశం లేకుండా చేసే న్యాయరక్షణ.

**విమర్శలను ఎదుర్కొనే వాస్తవం**

అమరావతి చట్టబద్ధతపై కొందరు ప్రశ్నలు లేవనెత్తుతారు.
"రాష్ట్రాలకు స్వతంత్రాధికారం దెబ్బతింటుందా?"
"భవిష్యత్తులో మార్పులు అసాధ్యమవుతాయా?"
"ఇది రాజకీయ ప్రయోజనాల కోసమా?"
అయితే ఈ ప్రశ్నలన్నింటినీ మించి నిలబడేది ఒక వాస్తవయి
అమరావతి నిర్మాణం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు అవసరమైన శాశ్వత పెట్టుబడి.రాజకీయ ప్రయోగాల నష్టాలు ఏపీలో ఇప్పటికే స్పష్టంగా కనిపించాయి. ఆ ప్రయోగాల పునరావృతాన్ని నిరోధించడం ప్రజాస్వామ్య రక్షణకు తప్పనిసరి.

**కేంద్రరాష్ట్ర సమన్వయంతో పునర్జన్మ**

టిడిపి - ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం అమరావతి భవితవ్యాన్ని మళ్లీ స్థిరపరిచింది. సిఆర్డిఏ నుంచి కేంద్రానికి పంపిన వివరాలు, అటార్నీ జనరల్ నివేదిక, న్యాయశాఖ-హోం శాఖ పరిశీలనలు, క్యాబినెట్ ఆమోద ప్రక్రియుఇవి అన్నీ కేంద్రం ఈ విషయంలో చూపుతున్న అత్యంత శ్రద్ధకు నిదర్శనం.

**పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన రోజు**

అది కేవలం చట్టం ఆమోదం మాత్రమే కాదు.
అది ఆంధ్రప్రదేశ్‌కు రాజకీయ స్థిరత్వం పునర్నిర్మాణం,
అమరావతి రైతుల పోరాటానికి సంఘటనాత్మక గౌరవం,
మొత్తం రాష్ట్రానికి అభివృద్ధి కొత్త అధ్యాయం.

**చివరిగా అమరావతికలల నుండి నిజ జీవితానికి సంబంధించిన అంశం**

అనిశ్చితి ఎన్నాళ్ళు ఎగసిపడినా, ఆశ అనే వెలుగు చివరికి విజయం సాధిస్తుంది.
అమరావతికి చట్టబద్ధత ఇవ్వడం ఆంధ్రప్రదేశ్‌కు కేవలం శుభవార్త కాదు.
ఇది రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టే ప్రజాస్వామ్య విజయం.
కలతను తొలగించి, కలను నిజం చేసే చారిత్రాత్మక తీర్పు.
అమరావతి ఇక వివాదం కాదు
ఎప్పటికీ నిలిచే రాజధాని.
ఇక సందిగ్ధం కాదు భవిష్యత్ తరాలకు అందే సమగ్ర హామీ.
ఈ నిర్ణయం ఒక ప్రాంతానికి మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవానికి ప్రజలకు కూడా...

# ప్రపంచానికే ఆదర్శం మన యువత.. వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది

- మొదటి పేజి తరువాయి

మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు.దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు.గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను... ఎవరినీ చేయనివ్వను

- మొదటి పేజి తరువాయి

అర్చకులు-సిబ్బంది నివాస గృహాలు, రెస్ట్ హౌస్, పరిపాలన భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, కలియుగ దైవం వేంకటేశ్వరుని ఆశీస్సులతోనే రాజధానికి అమరావతి అని పేరు పెట్టామని గుర్తు చేశారు."దేవతల రాజధాని అమరావతే మన రాజధానిగా ఉండాలని సంకల్పించాం. కృష్ణానది ఒడ్డున 25 ఎకరాల్లో 2019లోనే ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాం. కానీ గత ప్రభుత్వం విధ్వంసం తప్ప ఒక్క మంచి పని కూడా చేయలేదు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని త్యాగం చేస్తే, వారికి గత ఐదేళ్లు నరకం చూపించారు. ఆ వెంకన్ననే నమ్ముకున్న రైతులు 'న్యాయస్థానం టు దేవస్థానం' పేరుతో పాదయాత్ర చేశారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని అన్నారు.తాను శ్రీవారికి పరమ భక్తుడినని, తమ ఇంటి దైవం ఆయనేనని చంద్రబాబు తెలిపారు. "మా ఇంటి నుంచి చూస్తే శేషాచల పర్వతం కనిపిస్తుంది. చిన్నప్పటి నుంచి స్వామిని చూస్తూ పెరిగాను. స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను, ఎవరినీ చేయనివ్వను. తప్పు చేస్తే ఆయనే ఈ జన్మలో శిక్షిస్తాడు. నాడు స్వామివారి సేవకు వెళ్తుంటే నక్సలైట్లు 23 క్లెమోర్ మైన్లు పేల్చినా, ఆ స్వామి దయ వల్లే ప్రాణాలతో బయటపడ్డాను" అని నాటి ఘటనను గుర్తుచేసుకున్నారు. తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానానికి శ్రీకారం చుడితే, తాను స్విమ్స్‌లో ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించానని చెప్పారు.రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాన్ని చేపడతామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. ముంబైలో రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో స్వామి ఆలయాన్ని నిర్మిస్తోందని ఉదహరించారు. భక్తులు కూడా ఆలయ నిర్మాణాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా, సంపదతో వర్ధిల్లాలని ఆ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు సభ్యులు, రైతులు, భక్తులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు... టీటీడీపై సీఎం చంద్రబాబు సమీక్ష

ప్రపంచం నలుచెరగులా తిరుమల శ్రీవారి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు చేపట్టాలని, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్యాత్మికత, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గురువారం సచివాలయంలో దేవాదాయశాఖ, టీటీడీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుమల ఆలయంలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాలను రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రసాదాల తయారీ, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో తిరుమల ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. ప్రసాదాల తయారీకి సేంద్రియ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని, భక్తుల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వాడుకోవాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యం కావాలని, టీటీడీ భక్తుల పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు.

**టీటీడీ ఆసుపత్రులు ఆదర్శంగా నిలవాలి**

తిరుపతిలోని స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులను అనుసంధానం చేసి, వాటిని ఒక మోడల్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఆస్పత్రుల తరహాలో అత్యుత్తమ నిర్వహణ ప్రమాణాలతో వీటిని తీర్చిదిద్దాలని సూచించారు. దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులను 'శ్రీవారి సేవకులు'గా ఆహ్వానించి, వారి సేవలను ఈ ఆసుపత్రుల ద్వారా భక్తులకు, ప్రజలకు అందించేలా అవకాశం కల్పించాలన్నారు.
మందులను నేరుగా తయారీదారుల నుంచే కొనుగోలు చేయాలని, అత్యవసర సమయాల్లో క్యూలైన్లలోని భక్తులను తక్షణమే ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. భక్తులకు సులభంగా సమాచారం అందించేందుకు అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు.

**వైకుంఠ ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు**

రాబోయే వైకుంఠ ఏకాదశికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎం టీటీడీ అధికారులను ఆదేశించారు. భక్తులు అన్ని భాషల్లోనూ దర్శనానికి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించాలని, వీలైనంత ఎక్కువ మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలోని అన్ని దేవాలయాల్లో నిత్యాన్నదానం జరిగేలా చూడాలన్నారు. తిరుమల కొండలపై జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దివ్య ఔషధవనం ఏర్పాటుతో పాటు వివిధ రకాల పుష్పజాతుల మొక్కలను నాటాలని పేర్కొన్నారు.

# మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు

- మొదటి పేజి తరువాయి

పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరిలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన 'నూర్ మసీద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మస్జీద్‌ను ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "మంగళగిరి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం నాకు దక్కింది. నాకున్న శక్తి మేరకు సేవ చేస్తున్నాను. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సమాజంలో ఇంకా పేదరికం ఉంది, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు.తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, "2019లో దేవుడు నాకు ఒక కఠినమైన పరీక్ష పెట్టాడు. చాలామంది నన్ను ఎగతాళి చేశారు. కానీ, అదే దేవుడు నాకు శక్తిని, పట్టుదలని ఇచ్చాడు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే విజయం తప్పక వరిస్తుంది. కష్టాలు అందరికీ వస్తాయి, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి" అని యువతకు స్ఫూర్తినిచ్చారు. కాలం మారిందని, యువత చదువుపై దృష్టి సారించి భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.2047 నాటికి దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా

అందరూ పనిచేయాలని లోకేశ్ కోరారు. "మెరుగైన సమాజ నిర్మాణం కోసం నైతిక విలువలు చాలా అవసరం. ముఖ్యంగా మహిళలను గౌరవించాలి. మన మధ్య విభేదాలు సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు, అలాంటి వాటికి తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలి. ప్రజలు నా పనిని గుర్తించినప్పుడే నాకు కొండంత బలం. అందరికీ అండగా ఉంటూ, కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం" అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, కమిటీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్‌వి తెలివితక్కువ మాటలు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన 'దిష్టి' వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపుతున్నాయి. కోనసీమ పచ్చదనానికి తెలంగాణ నేతల దిష్టి తగిలిందన్న పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్‌వి తెలివితక్కువ మాటలని, మెదడుకు పనిచెప్పకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు."మా దిష్టి వాళ్లకు తగలడం కాదు, ఇన్నేళ్లుగా వాళ్ల దిష్టే మా తెలంగాణకు, హైదరాబాద్‌కు తగిలింది" అని జగదీశ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రతిరోజూ వందలాది మంది ఏపీ నుంచే హైదరాబాద్‌కు వస్తున్నారని, అలాంటప్పుడు తమ దిష్టి ఎలా తగులుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ దిష్టి తగులుతుందని అంత భయంగా ఉంటే, ఓ దిష్టిబొమ్మ పెట్టుకోవాలని, దాన్ని తామేమీ ఆపలేదని వ్యంగ్యంగా అన్నారు. "ఇంత తెలివిలేని వాళ్లు కూడా ఉప ముఖ్యమంత్రులు అవుతున్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అంటూ జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.బుధవారం కోనసీమ జిల్లా రాజోలులో 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పచ్చని కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలింది. ఇక్కడి కొబ్బరి చెట్ల పచ్చదనాన్ని చూసే బహుశా వారికి ప్రత్యేక
రాష్ట్రం ఆలోచన వచ్చిందేమో" అని వ్యాఖ్యానించారు. నరుడి దిష్టికి రాయి కూడా పగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు.పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం కాగా, జగదీశ్ రెడ్డి తాజా ప్రతిస్పందనతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ మాటల యుద్ధం రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# స్వామివారి విషయంలో ఏ తప్పు చేయలేదు.. పాలీగ్రాఫ్ టెస్టుకు నేను సిద్ధం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యి కొనుగోలు వ్యవహారంపై జరుగుతున్న వివాదంపై టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. ఈ విషయంలో తనపై వస్తున్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని, అవసరమైతే పాలీగ్రాఫ్ పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, సిట్ దర్యాప్తును కేవలం 2019-24 మధ్య కాలానికే ఎందుకు పరిమితం చేస్తున్నారని ప్రశ్నించారు. అంతకుముందు జరిగిన కొనుగోళ్లపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.
తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆలయ ప్రతిష్ఠను పెంచేందుకే పనిచేశానని, దేవుడి విషయంలో ఎలాంటి తప్పు చేయలేదని సుబ్బారెడ్డి అన్నారు. తనపై విషప్రచారం చేస్తున్నారని, ఈ వివాదాన్ని పూర్తిగా రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో సీఎం చంద్రబాబు లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపణలు చేసినప్పుడు తాను సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తుచేశారు. తాను తప్పు చేసి ఉంటే న్యాయస్థానానికి ఎందుకు వెళ్తానని ప్రశ్నించారు.
సిట్ దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే కల్తీ నెయ్యితో లడ్డూలు తయారుచేశారని మీడియాలో కథనాలు రావడం దురదృష్టకరమని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నెయ్యి ట్యాంకర్లను క్షుణ్ణంగా
పరిశీలించి, ల్యాబ్ టెస్టుల తర్వాతే వినియోగించామని వివరించారు. ఈ విషయంలో మీడియా సంయమనం పాటించాలని సూచించారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి కొనుగోళ్లపై కూడా సమగ్రంగా దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీవాణి దర్శనం ద్వారా పారదర్శకత తీసుకువచ్చామని, శ్రీనివాస సేతు నిర్మాణంలో ప్రజాధనాన్ని ఆదా చేశామని, తిరుమలలో ప్లాస్టిక్‌ను నిషేధించామని తన హయాంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన గుర్తుచేశారు.

# ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే

సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది.కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను వక్రీకరించకూడదని ఆయన పేర్కొన్నారు.వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియాలో వినియోగదారులు సృష్టించే కంటెంట్‌ను నియంత్రించేందుకు సరైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేశాం...

- మొదటి పేజి తరువాయి

టన్నుల ధాన్యం సేకరించి, రైతుల ఖాతాల్లో రూ. 1,713 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 4 నుంచి 6 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రైతులు రూపాయి కూడా నష్టపోకుండా కల్లాల వద్దే ధాన్యం కొంటున్నామని స్పష్టం చేశారు.కొంతమంది నేతలు ధాన్యం కొనుగోళ్లపై అనవసరంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నింటినీ చెల్లించిందని గుర్తుచేశారు. ఈ సీజన్‌లో ఒక్క కృష్ణా జిల్లాలోనే లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం ఒక రికార్డు అని అన్నారు. గోదావరి జిల్లాల్లోనూ లక్ష టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు.
క్షేత్రస్థాయిలో అధికారులు రేయింబవళ్లు కష్టపడుతుంటే, వారి మనోధైర్యం దెబ్బతినేలా కొందరు విమర్శలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం 2022-23లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ. 679.79 కోట్లు చెల్లిస్తే, తమ ప్రభుత్వం ఇప్పటికే అంతకు రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు జరిపిందని పోల్చి చెప్పారు.రవాణా వ్యవస్థను కూడా పటిష్టం చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24లో కేవలం 455 లారీలు నమోదు కాగా, తమ ప్రభుత్వంలో ఇప్పుడు 2,715 లారీలు నమోదు చేసుకున్నాయని వివరించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో రవాణా వాహనాల బకాయిలు రూ. 9 కోట్లు చెల్లించామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 7.53 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచామని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో అదనంగా మరో లక్ష సంచులను సిద్ధం చేశామని చెప్పారు. వాతావరణ మార్పుల దృష్ట్యా రైతుల ఆందోళనను గమనించి మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియను ముందే ప్రారంభించామన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం 30వ తేదీ తర్వాత కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వర్ష సూచన ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వర్షాల నుంచి పంటను కాపాడేందుకు కౌలు రైతులకు టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచామన్నారు. దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ధాన్యం కొనే ప్రయత్నం చేస్తారని, ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 మద్దతు ధర చెల్లిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్‌లో నమోదైన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

## బంగాళాఖాతంలో 'దిట్వా' తుపాను...

- మొదటి పేజి తరువాయి

ఈ తుపానుకు 'దిట్వా' అని నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ (%ఔమీ%) సభ్య దేశాల జాబితా ప్రకారం యెమెన్ దేశం ఈ పేరును సూచించింది. యెమెన్‌కు చెందిన సోకోత్రా ద్వీపంలో 'దిట్వా లగూన్' అనే పేరుతో ఒక చాలా ప్రసిద్ధమైన, అందమైన ఉప్పునీటి సరస్సు ఉంది. ఇప్పుడు ఆ ప్రదేశం పేరునే, బంగాళాఖాతంలో ఏర్పడే తుపానుకు పెట్టారు. ప్రస్తుతం సముద్రంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వ్యవస్థ మరింత బలపడి తీరం వైపు కదులుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.ఈ తుపాను వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంక తీరప్రాంతాన్ని దాటి, శనివారం నాటికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరితో పాటు దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం వైపునకు చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (%×వీణ%) అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరప్రాంత ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను కదలికలను నిరంతరం గమనిస్తూ, ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసేందుకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సన్నద్ధమైంది.చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (%=వీజ%) అంచనాల ప్రకారం, గురువారం దక్షిణ తమిళనాడు, డెల్టా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రత మరింత పెరగనుంది. ముఖ్యంగా డెల్టా, దాని పరిసర జిల్లాల్లో శుక్రవారం నాడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం నాటికి ఈ వాతావరణ వ్యవస్థ తీరం వెంబడి ఉత్తరం వైపు కదులుతున్న కొద్దీ, ఉత్తర తమిళనాడు జిల్లాల్లోనూ భారీ వర్షాలు నమోదవుతాయని అధికారులు వివరించారు.ఇదిలా ఉండగా, ఈశాన్య ఇండోనేషియా, మలక్కా జలసంధిపై కేంద్రీకృతమైన 'సెన్యార్' అనే మరో తుపాను తూర్పు వైపుగా కదులుతోంది. అయితే ఈ తుపాను వల్ల తమిళనాడుకు గానీ, భారత తీరానికి గానీ ఎలాంటి ముప్పు లేదని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

# బీఎల్వోల శిక్షణకు ప్రత్యేక దృష్టి పెట్టాలి

## కలెక్టర్ హరేందర్ ప్రసాద్ ఆదేశాలు

### ప్రక్రియల్లో పారదర్శకతకు ముందస్తు సిద్ధత అవసరం




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27 :** రాబోయే ఎన్నికల నేపథ్యంలో బీఎల్వోలకు (బూత్ లెవెల్ వర్కర్స్) అన్ని ఎన్నికల సంబంధిత అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు క్రమం తప్పకుండా ప్రత్యేక శిక్షణలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద ర్ ప్రసాద్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ స్థానిక కలెక్టరేట్ వీసీ హాల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల మార్గదర్శకాల మేరకు ప్రతి ప్రక్రియలో ఖచ్చిత త్వం, పారదర్శకత అవసరమని స్పష్టం చేశారు.



శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగాలి ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, మ్యాపింగ్ కార్యక్రమాలతో పాటు ఇతర కీలక అంశాలపై నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి సిబ్బందికి శిక్షణ శిబిరా లు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. తాజాగా 25వ తేదీన బీఎల్వోలుకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పెండింగ్ లేకుండా డిస్పోజల్ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఒక ఈఆర్వో, ఒక ఏఈఆర్వో పోస్టుల భర్తీ విషయాన్ని సీఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

ముందస్తు ప్రణాళికతో పారదర్శక మ్యాపింగ్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లాధికా రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రీసార్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకొని 2002 ఓటర్ల జాబితాను 2025 సవరణ జాబితాతో పోల్చి పరిశీలించాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో పూర్తి చేయేందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

ఈఆర్వోలు, ఏఈఆర్వోలు రోజుకు కనీసం ఒక గంట సమయం కేటాయించి బీఎల్వోలకు తప్పనిసరిగా శిక్షణలు అందించాలని సూచిం చారు. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పని చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పోస్టుమెన్ల సహకారంతో మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఎక్కడైనా బీఎల్వోలు అందుబాటులో లేకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ డీటీలు, ఎలక్షన్ సెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు కూటమి ప్రభుత్వం మోసం చేసింది

### వైఎస్ఆర్సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి డా. తుళ్ళి చంద్రశేఖర్ యాదవ్ విమర్శ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27 :**కూటమి ప్రభుత్వం బీసీలను ఘోరంగా మోసం చేసిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసిందని వైఎస్ఆర్సీపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి డా. తుళ్ళి చంద్రశేఖర్ యాదవ్ ఆరోపించారు. ఈ నేపథ్యం లో విశాఖలోని బీసీ సెల్ సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చి న హామీలు ఎక్కడ?

చంద్రబాబు–లోకేష్–పవన్ కలయిక బీసీలను అభివృద్ధి చేస్తామని మాటలు ఇచ్చి, అధికారం లోకి వచ్చాక ఒక్క హామీ కూడా నిలబెట్టలేదని ఆయన మండిపడ్డారు.

బీసీ రక్షణ చట్టం మాటల్లోనే మిగిలిపోయింద ని,ఫీజు రీయింబర్స్‌మెంట్,నిరుద్యోగ భృతి,

పంట నష్టం పరిహారం,అన్నదాత పథకం నిధులు ,అన్నీ కేవలం ప్రచార నినాదాలే అయ్యాయని ఆయన విమర్శించారు. జగన న్న పాలనలో బీసీలకు దక్కిన గౌరవం కూటమి పాలనలో నిరాశ డా. చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ, బీసీలను ఓటర్లుగా కాకుండా పాలకులుగా నిలబెట్టింది జగనన్నే. 2019%–%24 మధ్య బీసీలను ఆత్మగౌరవంతో నిలబెట్టే విధంగా చరిత్రలో ఎప్పుడూ లేని నిర్ణయాలు తీసుకున్నా రు అని గుర్తుచేశారు.అందులో భాగంగా:

బీసీ కుటుంబాలకు 1.98 లక్షల కోట్లు నేరుగా లబ్ధి,వాలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతి రహితంగా నగదు బదిలీ,అమ్మఒడి, జగన న్న విద్యా దీవెన, వసతి దీవెన, విద్యున్నతి, విదేశీ విద్య నిధి,బీసీ మహిళలకు వైయస్సార్ చేయూత, సున్నా వడ్డీ రుణాలు,కులవృత్తి వర్గాలకు జగనన్న చేదోడు, నేతన్న నేస్తం,

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాల్లో 50% రిజర్వేషన్,ప్రభుత్వ పదవుల్లో 90,000 పైగా బీసీల నియామకం,15 మంది బీసీ మంత్రులు, 22 మంది బీసీ ఎమ్మెల్సీలు లాంటి చారిత్రాత్మక నిర్ణయాలు,వాటిని ఆయన విశదీకరించారు.

కూటమి ప్రభుత్వం పాలనలో పరిస్థితి దారుణం

ప్రస్తుత పాలనలో బీసీ హాస్టళ్లలో ఆహార సమస్యలు, డ్రాప్ అవుట్ల పెరుగుదల, విద్యార్థుల దయనీయ పరిస్థితులు బయటపడుతున్నాయని ఆయన అన్నారు.గోరుముద్ద పథకం కింద సీఎం స్వయంగా ఆహారం నాణ్యత చూసిన రోజులు పోయి, ఇప్పుడు పురుగులున్న అన్నం తిని పిల్లలు ఆసుపత్రులు పాటిస్తు న్న పరిస్థితి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రకృతి వైపరీత్యాలు బీసీ రైతుల బాధ పట్టని కూటమి తుఫాన్ నష్టాల్లో బీసీ రైతులే అధికంగా దెబ్బతిన్నా, ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని, రైతు బీమా, అన్నదాత పథకాల్లో విఫలం కారణంగా అనేకమంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.కూటమి పాలనపై బీసీల అసహనం ఒక్కవైపు హామీలు.మరోవైపు ద్రోహం. ఈ ప్రభుత్వం బీసీలకు వెన్నుపోటు మాత్రమే పెట్టింది. ఏపీ బీసీలు కూటమి ప్రభుత్వాన్ని పూర్తిగా తిరస్కరించడానికి సిద్ధంగా ఉన్నారు” అని డా. చంద్రశేఖర్ యాదవ్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సన్నపల రవీంద్ర భరత్, బీసీ సెల్ విశాఖ నార్త్ ఇన్‌చార్జ్ పి. హరికృష్ణ, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

### అందరూ ఇటు చూడండి రెడీ వన్ టు త్రీ..!

# ఫోటో వచ్చింది సార్ ఆవును వదిలేయండి

### జీవీఎంసీ వెటర్నరీ అధికారుల తీరుకు నవ్విపోదురు గాక

### ఆవులను పట్టిన వెంటనే ఫోటో తీసి వదిలివేసిన వైనం





పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 27:** హాస్యానికి ఏదో సినిమాలో చెప్పినట్టు”ఏమి చేస్తున్నావురా అయ్యా అంటే పాలు పితుకుతున్నాను అంటాడు.మిట్ట మధ్యాహ్నం దున్నపోతుకి పాలు పితుకుతున్నావా దున్నపోతా !”అన్నట్టు ఉంది జీవీఎంసీ వెటర్నరీ అధికారుల తీరు.

బాలాజీ నగర్ ప్రధాన రహదారిలో రాత్రి,పగలు నడిరోడ్డుపై ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్న పశువులను కట్టడి చేయాలంటూ, పశువుల సంచారంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పలు ప్రమాదాలకు అవి కారణం అవుతున్నాయని, పెన్ పవర్ దినపత్రికలో”చలనం లేని అధికారులు ౼చలానాలతో సరి” శీర్షికన వార్త ప్రచురించడం జరిగింది. స్పందించిన అధికారులు పశువులను తరలించేందుకు వచ్చిన వాహనం వద్దకు ఆవులు తీసుకుని వచ్చి వాహనం లోకి ఆవును ఎక్కిస్తున్నట్లు ఫోటో తీసి ఫోటో తీసిన వెంటనే అవును వదిలివేశారు.

పై ఫోటోను గమనించినట్లయితే చెప్పిన హాస్య సన్నివేశానికి, వాహనం ఆవుకి తీసిన ఫోటో కి వ్యత్యాసం జాగ్రత్తగా గమనించండి. ఆవులను తరలించాలంటే వాహనంతో పాటు ఆవులను వాహనంలోనికి ఎక్కించేందుకు బల్లలు కూడా ఏర్పాటు చేస్తారు. ఇదేమి గమనించని సిబ్బంది ఆవును వాహనం వరకు తీసుకుని వచ్చి ఫోటో తీసి అధికారులకు అప్లోడ్ చేసి ఆవును వదిలివేశారు. ఇది జీవీఎంసీ జోన్ 2 జీవీఎంసీ వెటర్నరీ అధికారుల తీరు.






## మంత్రి పీఏ వేదింపుల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలి

### వైఎస్సార్సీపి మహిళా విభాగం డిమాండ్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27 :** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర కార్యాల యంలో శాసనమండలి సభ్యురాలు, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె తెలుగుదేశం పార్టీపై తీవ్ర విమ ర్శలు గుప్పించారు.కళ్యాణి మాట్లాడుతూ, మంత్రి సంధ్యారాణి పీఏ సతీష్ ప్రవర్తననే చూస్తే టీడీపీ తెలుగు దండుపాళ్యం పార్టీగా మారిపోయిందని స్పష్టమవుతోంది అని వ్యాఖ్యానించా రు. ఒక ప్రభుత్వ మహిళా ఉద్యోగిని పైఏ స్థాయి లో వేధింపులకు గురిచేసినా పోలీసులకు ఫిర్యా దు చేసినా స్పందన లేకపోవడం, పైగా మంత్రిని ఆశ్రయిస్తే బదిలీ ‘శిక్ష’గా విధించడం మానవత్వా నికి విరుద్ధమని నిలదీశారు. ఉద్యోగం పేరుతో భారీగా డబ్బులు దండుకున్న పీఏ%ొా% తన డబ్బులు తిరిగి అడిగిన మహిళా ఉద్యోగిని టీడీపీ నేతల పక్కన నిలబడాలని బలవంతం చేయడం దారుణమని కళ్యాణి తీవ్రంగా ఖండించారు.

మహిళలను వేధించిన వారందరికీ అదే ఆఖరి రోజు కావాలని చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పు డు తన కేబినెట్ మంత్రి పీఏ చేసిన దారుణా లపై ఏమట చెప్పరు? వెంటనే ఆయనను అరెస్టు చేయాలి. మంత్రి సంధ్యారాణిని కేబినెట్ నుండి తొలగించాలి” అని కళ్యాణి డిమాండ్ చేశారు.

ఈ ప్రెస్ మీట్‌లో వైఎస్సార్సీపి విశాఖపట్నం మహిళా విభాగం నగర అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, కార్పొరేటర్లు శశికళ, జిల్లా అంగన్వడి విభాగం అధ్యక్షురాలు పెనుమత్స శ్రీదేవి వర్మ, ఉపాధ్యక్షురాలు పార్వతి, తూర్పు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు శిరీష పాల్గొన్నారు.

### సామాజిక బాధ్యతగా నిత్యవసర వస్తువులు పంపిణీ: కాకి గంగరాజు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 27:** కాకి శ్రీరాములు దేవుడు చారిటబుల్ ట్రస్ట్. టిడిపి నాయకులు కాకి గంగరాజు ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా 11వ వార్డు గాంధీనగర్లో మరణించిన పోలిపిల్లి కన్నారావు అనే వ్యక్తి మరణించారు.అతని కుటుంబం ఆర్థిక పరిస్థితిని గమనించిన ఆయన స్థానిక టిడిపి నాయకులతో కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సహాయంగా 50 కేజీలుబియ్యం నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు ముగడ రాజారావు,జనసేన అధ్యక్షులు సారిపల్లి రాము, సీనియర్ నాయకులు మూది అప్పారావు,రంగాలమంగరాజు, సింహాద్రి.శేఖర్,పచ్చిపాల శ్రీను,కుందూరు నగేష్. కుందూరు శ్రీను,బొండపల్లి సంతోష్,జామి శివ,సంఘ సభ్యులు పాల్గొన్నారు,

# కూటమి ప్రభుత్వంతోనే సమస్యలు పరిష్కారం అంటూ, ప్రజలనుండి వినతులు స్వీకరిస్తున్న రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్





**పాడేరు, పెన్ పవర్, నవంబర్ 27:**
అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రత్యక్షంగా విని పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నామని ఆయన తెలిపారు.
హుకుంపేట మండలం సంతారి, బుడ్డపుట్టి పంచాయతీలకు సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. అలాగే ముంచెంగిపోటు మండలం దారెల, కిలగాడ, వనవాసింగి, జోలపుట్ పంచాయతీలలో కూడా సిసి రోడ్లు నిర్మించాలని వినతులు అందాయి.
దారేలా పంచాయతీ పరిధిలో కిలగడ-దారేలా, గానీడా-వానబాసింగి-తోంగికిట, పీఆర్ రోడ్-తాలింబ వయా కుమారపుట్ వరకు బీటీ రోడ్లు వేయాలని విన్నవించారు.
హుకుంపేట మండల కేంద్రంలో రైతుల కోసం నిల్వ కేంద్రం భవనం నిర్మించేందుకు సహకరించాలని కోరారు. తాజంగి కేజీబీవీ లో పనిచేస్తున్న ఏఎన్ఎం జీతాలను పెంచాలని, ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. సంతారి గ్రామ విద్యార్థులు స్కూలుకు వెళ్లడానికి సులభంగా సిసి రోడ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు.
అనంతగిరి మండలం గరుగుబిల్లి వద్ద వంతెన నిర్మాణం చేయాలని, ముంజంగిపుట్ మండలం బరడ పంచాయతీ వన్రంగుల బీటీ రోడ్డునుంచి సులభంపూర్ వరకు బీటీ రోడ్డు వేయాలని, అలాగే డైనోజోల్ల కల్వర్టును నిర్మించాలని విన్నవించారు.
రంగబోయిలు పంచాయతీ కొదంజుల-జరగదు వరకు మెటల్ రోడ్డు,
కోదంజుల-రంగబోయిల-చంపపుట్ వరకు బీటీ రోడ్డు,
ఏనుగురై పంచాయతీ రావలపుట్-ఏనుగుల గ్రామం వరకు బీటీ రోడ్డు,
రంగబోయిల పంచాయతీ జరగదు వరకు మట్టి రోడ్ల నిర్మాణం,
కుమాడ పంచాయతీ తాడేపుట్-ముఖిపుట్ వరకు బీటీ రోడ్డు,
మద్దెలబంధ-సంత వీధి వరకు బీటీ రోడ్డు,
ఏనుగురై పంచాయతీ మజ్జిగూడ-కించైపూర్-మినుములుపుట్ వరకు బీటీ రోడ్డు,
జర్జుల పంచాయతీలో అమలగూడ-గొర్రెలమెట్ట వరకు తారు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరారు.

**ఉపాధ్యాయుల వినతులు కూడా స్వీకరణ**
ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు కూడా చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ గారికి తమ సమస్యలను వినిపించారు. పాఠశాలలలో విద్యార్థుల సదుపాయాలు, బోధనా సామగ్రి లోపాలు, ఖాళీ పోస్టుల భర్తీ, రోడ్డు సౌకర్యం లేక పాఠశాలకు చేరడంలో ఎదురవుతున్న ఇబ్బందులు వంటి అంశాలపై వారు వినతులు సమర్పించారు. చైర్మన్ వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి సమస్యలను పరిశీలించి పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి బాకూర్ సర్పంచ్ బాకుర్ వెంకటరమణ, టిడిపి డివిజన్ నాయకులు, దారేలా సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, శోభకోట సర్పంచ్ శశిభూషణ్ నాయుడు, మాజీ జడ్పిటిసి సుబ్బారావు, టిడిపి ప్రధాన కార్యదర్శి జగత్, వనమాసింగి సర్పంచ్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ వాసుదేవ్, ఎంపిటిసి కొమ్మరమ్మ కళావతి, మహిళా నాయకురాలు నిర్మల, బుజ్జిబాబు, అచ్చిబాబు, భూషణం రావు, జనసేన నాయకులు కోటి, చిన్ని, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మెగా జాబ్ మేళా -12 కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

- యువతకు సువర్ణావకాశం
- ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 27:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నిరుద్యోగ యువతకు శుభవార్త. ఈ నెల 28వ తేదీ శుక్రవారం పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు గూడెం కొత్త వీధి ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు తెలిపారు.
ఆయన మాట్లాడుతూ ?ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులకు ఇది ఒక సువర్ణావకాశం అన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో మొత్తం 12 కంపెనీలు పాల్గొంటున్నాయి. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారెవరైనా ఈ మేళాలో పాల్గొనడానికి అర్హులు. అర్హులైన అభ్యర్థులకు కంపెనీలు అక్కడికక్కడే ఆఫర్ లెటర్లను జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. చదువుకున్న యువతి యువకులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.?మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 6302636174 లేదా 7569923256 నెంబర్లను సంప్రదించవచ్చు అన్నారు.

## సంకాడ గ్రామంలో "రైతన్న మీకోసం" కార్యక్రమం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం సంకాడ గ్రామంలో "రైతన్న మీకోసం" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామ రైతులకు వ్యవసాయాభివృద్ధి, ఆధునిక పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పంచసూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు వంటి అంశాలపై తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు వివరించారు. గ్రామ అభివృద్ధికి కీలకంగా వ్యవహరించే ఈ పంచసూత్రాలు రైతుల ఆదాయాన్ని పెంపొందించడంలో ఎంతో తోడ్పడతాయని తెలిపారు. ముఖ్యంగా నీటి సంరక్షణ, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక, ఆధునిక యాంత్రిక పద్ధతుల వినియోగం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా గ్రామ రైతులకు మంచి లాభాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు,నాయకులు మామిడి చంటిబాబు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ సాగిన కైలాసపతి,ఎం.చిన్ని సహా సంకాడ గ్రామానికి చెందిన రైతులు పాల్గొని సూచనలు, అభిప్రాయాలు వెల్లడించారు. గ్రామ వ్యవసాయ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వారు అన్నారు.రైతుల ఉత్పాదకత పెంపు, ఆదాయం అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో మంచి స్పందనను కలిగి విజయవంతమైంది.

## గోమంగి మండలం ఏర్పాటు పై మంత్రుల కమిటీ,ఐదవ తేదీ నా తీసుకున్న నిర్ణయాన్ని యధావిధిగా కొనసాగించి మండల ఏర్పాటు చేయాలి.

- జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ గారికి, గోమంగి మండల సాధన సమితి వినతి.



**పాడేరు , పెన్ పవర్,నవంబర్27:** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలాన్ని విభజించి గోమంగిని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రులు కమిటీ ఈనెల 5వ తేదీన ఆమోదం తెలిపిన విషయం అందరికీ తెలిసిందే. అయితే 25వ తేదీన మంత్రుల కమిటీ సమావేశంలో గోమంగి మండల కేంద్రం ఏర్పాటు విషయం ప్రస్తావన లేకపోవడం 13 పంచాయతీల ప్రజలు నిరాశకు గురయ్యారు గోమంగి మండలం ఏర్పాటుతోనే మారుమూల పంచాయతీల అభివృద్ధి జరుగుతుందని, ఐదో తేదీన తీసుకున్న మంత్రం కమిటీ నిర్ణయాన్ని యధావిధిగా కొనసాగించాలని జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ గారికి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా గోమంగి మండల సాధన సమితి నాయకులు కూడా బొంజు బాబు, కొమ్మ అనంత పద్మనాభం, కూడా రాధాకృష్ణ, గల్లీలు రమేష్ బాబు, గంపరాయి రవి వర్మ, టిడిపి నాయకులు కర్జ అచ్చిబాబు, సతీష్ కుమార్, గోపాలం, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్.






**గుమ్మలక్ష్మీపురం నవంబర్. 27.పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురం మండలం, లక్కగూడ పంచాయితీ పరిధిలోగల మొరమ గ్రామంలో కురుపం నియోజకవర్గం ఏఎంసీ చైర్మన్ కద్రక కళావతి ఆధ్వర్యంలో గురువారం నాడు రైతన్న మీకోసం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.ఏఎంసి చైర్మన్ కద్రక కళావతి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వ్యవసాయ పనిముట్లు పథకాలు విత్తనాలు మరియు రైతన్న మీకోసం సందేశాన్ని రైతులకు చదివి అవగాహన కల్పించడం
మండల లో ఉన్న ప్రతి గ్రామంలో100%ప్రకృతి వ్యవసాయము కొనసాగించాలన్నారు.ఎవరు కూడా రసానిక ఎరువులు పురుగుమందులు వంటి రసాయనక ఎరువులు వినియోగించకూడదని వీటి వలన భూమి సారం తగ్గిపోతుందని అన్నారు.ప్రస్తుతానికి ఎరువులు పురుగు మందులు ద్వారా పండించే పంటలు మనం తీసుకునే ఆహారము విషం తో కూడుకున్నది రసాయనిక ఎరువులు వాడడం వల్ల గాలి నీరు ఆహారం విషపూరితంగా కలుస్తమై ప్రజలకు క్యాన్సరు కిడ్నీ సమస్యలు వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని స్త్రీల సమస్యలు గుండెపోట్లు ఒళ్ళు నొప్పులు తదితర వంటి వ్యాధులు రావడంతో ప్రజలు చనిపోవడం జరుగుతుంది అందువలన ఎరువులు,పురుగుమందులు పూర్తిగా ప్రతి గ్రామంలో నిషేధించి ప్రకృతి వ్యవసాయంపై ముందుకు నడవాలి అన్నారు దీని ద్వారా భూమి సారము పెరిగి మంచి పంటలు దిగుబడి ఆరోగ్యము తో పాటు రైతుకు ఎంతో మేలని అన్నారు.రైతులకు 18 రకాల విత్తనాలతో తయారుచేసిన ఆర్టీఎస్ కిట్లను పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ వార్డ్ నెంబర్స్ గోపాల్ రావు,కార్తీక్,యూనిట్ ఇంచార్జె కమిడి భూషణ్ రావు,అగ్రికల్చరల్ ఏఈఓ శివకుమార్,వెటర్నరీ సీతమ్మ,మార్గదర్శి ప్రవంతి ఐ,సి,ఆర్,పి ఎస్ భాస్కర రావు,రవి,మధు,నవ్య,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నరు.

## ప్రత్యేక శిక్షణల ద్వారా, అధికారులకు, బీఎల్వోలకు అవగాహన కల్పించాం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 27 :**
కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల ఆదేశాల మేరకు చేపట్టే అన్ని రకాల ప్రక్రియలపై, అన్ని అంశాలపై బీఎల్వోలు సమగ్ర అవగాహన శిక్షణ కలిగి ఉండాలని, ఆ మేరకు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు క్రమం తప్పకుండా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి పాల్గున్న జిల్లా కలెక్టర్ ఏ ఎస్ ఆర్ (పాడేరు) జిల్లాకు సంబంధించిన అన్ని అంశాలను వెల్లడించారు. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియలు, ఇతర అంశాలపై నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బీఎల్వోలకు రెండు శిక్షణ కుడా పూర్తి చేశా మన్నారు. దరఖాస్తులను పరిశీలించి తగినచర్యలుచేపడుతున్నామని, పెండింగ్ లేకుండా చూసుకుంటున్నామని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు.
వీసీ అనంతరం అధికారులకు జిల్లా కలెక్టర్ పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. రాబోయే అవసరాలను, జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే అందరూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. 2002 జాబితాను 2025 ఓటర్ల జాబితాతో సరిచూసి పరిశీలించాలని చెప్పారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను ఇప్పటివరకు జిల్లాలో 28.14% మాత్రమే జరిగింది. అరకు, పాడేరు నియోజకవర్గంలో 1200దాటినా ఓటర్ల పోలింగ్ స్టేషన్స్ గుర్తించి, కొత్తగా 25 పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి వాటి పరిధిలో అన్ని మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. మిగిలినవన్నీ ఈనెలాఖరులోగా సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా ప్రణాళిక చేసుకోవాలన్నారు. రోజు ఒక గంట సమయం కేటాయించాలని, బీఎల్వోలకు క్రమం తప్పకుండా సూచనలు ఇస్తూ అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలని ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు సూచించారు. బీఎల్వోలు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, మ్యాపింగ్ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా బీఎల్వోలు చర్యలు తీసుకోవాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జాయింట్ కలెక్టర్ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, రెవిన్యూ డివిజన్ అధికారి ఏం వి ఎస్ లోకేశ్వరరావు, ఎలక్షన్ సెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన ముందస్తు జాగ్రత్తలు, బాధ్యతయుతమైన ప్రవర్తన కలిగి ఉండాలి యువత

### ఇన్చార్జి ప్రిన్సిపల్ డా .టి.ఎన్ .రసూల్

**పాడేరు, పెన్ పవర్, నవంబర్ 27:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడేరు ఆంధ్ర ప్రదేశ్ కోలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ సూచనల మేరకు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరు యొక్క రెడ్ రిబ్బన్ క్లబ్ (ఆర్ ఆర్ సి) ఆధ్వర్యంలో పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీను ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం 2025 సందర్భంగా కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు.
కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డా. టి. ఎన్. రసూల్ మాట్లాడుతూ, ఎయిడ్స్‌పై అవగాహన, ముందస్తు జాగ్రత్తలు మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తన యువతలో చాలా అవసరమని పేర్కొన్నారు. సరైన సమాచారం మరియు నిరోధక చర్యలు హెచ్‌ఐవి వ్యాప్తిని అడ్డుకునే అత్యంత ప్రభావవంతమైన మార్గాలని చెప్పారు.
ఆర్ ఆర్ సి కోఆర్డినేటర్ శ్రీ జి. దామోదరరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంలో రెడ్ రిబ్బన్ క్లబ్ పాత్రను వివరించారు. "యువత సమాజంలో అవగాహన రాయబారులుగా మారాలి" అని సూచించారు.




విద్యార్థులు "హెచ్‌ఐవి నివారణ %ః% యువత బాధ్యత" అనే థీమ్‌పై సృజనాత్మకంగా పోస్టర్లు తయారు చేసి ప్రదర్శించారు. అన్ని పోస్టర్లు ఆకర్షణీయంగా, సమాచారంతో నింపబడి ఉండటంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
కార్యక్రమంలో అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన అంబులెన్స్ ప్రారంబించిన - జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్



**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 27:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ కు సంబంధించి రెడ్ క్రాస్ సేవలు విస్తృతం చేసేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నూతన అంబులెన్స్ కొనుగోలు చేసింది. జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ తిరుమణి శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె. చిరంజీవి నాగ వెంకట సాహిత్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నూతన అంబులెన్స్ ను లక్ష్మివారం ఉదయం జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం విస్తృతంగా పనిచేస్తుందని, అధికారులందరూ రెడ్ క్రాస్ సొసైటీ కి సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యవర్గం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని అన్నారు. డిసెంబర్ లో జనరల్ బాడీ నిర్వహించి పూర్తిస్థాయిలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఎంపీడీవోలు, తహసిల్దార్లు, మండల విద్యాశాఖ అధికారులతో టీముగా ఏర్పాటు చేసి విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికి సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఆయా మండలాల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. రక్తపు నిలువలను పెంచేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తూ, రక్తదాన శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపడతామని అన్నారు.

పాడేరు డివిజన్ పరిధిలో రెడ్ క్రాస్ సొసైటీ వాహనాన్ని వినియోగించుకోవాలని పాత వాహనాన్ని చింతూరు ప్రాంతంలో అప్పగించి చింతూరు, రంపచోడవరం ప్రాంతానికి పనిచేస్తుందని, చింతూరు ప్రాజెక్టు అధికారి, ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీని జిల్లాలో మరింత బలంగా పనిచేసేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ విస్తరణకు జిల్లా కలెక్టర్ విశేష కృషి చేస్తున్నారని అదే చొరవతో జిల్లా అధికారులంతా తమకు సహకారం అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు నిర్వహిస్తామని తెలిపారు. గతంలో ఓ నూతన వాహనాన్ని కొనుగోలు చేసి విశాఖపట్నం కేజీహెచ్ లో ఎస్టీ సెల్ కు అప్పగించామని దానిని గిరిజన రోగుల కోసం వినియోగించుకుంటున్నారని అన్నారు.

వాహన ప్రారంభోత్సవానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులకు ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, రెడ్ క్రాస్ మెంబర్స్ జిల్లా కలెక్టర్ కు పూల బొకేతో ఆహ్వానం పలికారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి ఏం వి ఎస్ లోకేశ్వరరావు,రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సూర్యారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తమర్బా ప్రసాద్ నాయుడు, సుబ్రహ్మణ్యం, రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా స్వయం శక్తి సంఘాల మహిళల ర్యాలీ





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 27:** జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సమాజంలో అవగాహన పెంచడం, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం లక్ష్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జీకే వీధి మండలం హెడ్‌క్వార్టర్స్‌లో స్వయం శక్తి మహిళా సంఘాలు భారీ స్థాయిలో ప్రచార కార్యక్రమం నిర్వహించాయి.మహిళల హక్కులు, భద్రత, గౌరవం కాపాడుకోవడంపై సందేశాన్ని జనాల్లోకి తీసుకువెళ్లేందుకు మండల కేంద్రంలో మహిళలు ర్యాలీగా పాల్గొని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కుటుంబం నుంచి సమాజం వరకూ మహిళలకు అనుకూల వాతావరణం కల్పించే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు, వెలుగు ఏపీఎం సూర్యారావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సీసీలు,ఎస్‌హెచ్‌జి మహిళలు పాల్గొని మహిళల భద్రతపై సందేశం అందించారు. జెండర్ ఆధారిత హింస నిర్మూలనకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు కలిసి పని చేస్తేనే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమని పేర్కొన్నారు.

## అరుకు సబ్ ఇన్స్పెక్టర్ కుమారుని వివాహానికి హాజరైన జనసేన నాయకులు..

ప్రత్యేక స్వాగత సుమాంజలని అందుకున్న జనసేన అరకు నియోజకవర్గ పి ఓ సి ఇంచార్జ్ శెట్టి చిరంజీవి.



**పెన్ పవర్,నవంబర్ 27:** అరకు పోలీస్ స్టేషన్ పరిధి సబ్ ఇన్స్పెక్టర్ ట్రాఫిక్ కొర్ర. సుబ్బారావు కుమారుడు చంద్ర శేఖర్ మరియు లావణ్యల వివాహ వేడుకకు హాజరైన జనసేన అరకు నియోజకవర్గం పి ఓ సి ఇంచార్జ్ శెట్టి. చిరంజీవి అతనితో పాటు హుకుంపేట మండల జనసేన పార్టీ అధ్యక్షులు మరియు ఏ ఎం సి డైరెక్టర్ బలిజ. కోటేశ్వరరావు పడాల్,ఏ ఎం సి డైరెక్టర్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కొర్ర. వాసుదేవ్, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యనిర్వాహన కమిటీ సభ్యులు పరదాని. సురేష్, హుకుంపేట జనసేన పార్టీ ఐటీ ఇంచార్జ్ కొర్ర. నారాయణ మూర్తి, బీజేవైఎం సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కొర్ర. కొండబాబు, జనసేన పార్టీ హుకుంపేట మండల కోర్ కమిటీ సభ్యులు మోహన్ జీ, చీకుమద్దుల పంచాయతీ ఇంచార్జ్ కొర్ర. రాజారావు. తదితరులు పాల్గొన్నారు

## చింతపల్లి-జీకేవీధి మండలాల్లో శనివారం విద్యుత్ నిలిపివేత!



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,నవంబర్ 27:** చింతపల్లి మరియు జీకే వీధి మండల పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం (29-11-2025) న విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు.ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వేణుగోపాల్ అందించిన వివరాల ప్రకారం, 33 కేవీ చింతపల్లి ఫీడర్‌లో అత్యవసర మరమ్మతు పనులు చేపట్టాల్సి రావడంతో, ఆ రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయబడుతుంది. లైన్ మరమ్మతులు సురక్షితంగా, సమయానికి పూర్తి కావడానికి ఇది అవసరమని తెలిపారు.ఈ నేపథ్యంలో సంబంధిత రెండు మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని, విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.

## విద్యా వ్యవస్థ విఫలం విద్యార్థుల భవిష్యత్తు అయోమయం..

- ప్రభుత్వం నిర్లక్ష్యంతో గిరిజన విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనలో ఉంది
- వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు




**హుకుంపేట పెన్ పవర్ నవంబర్ 27** హుకుంపేట మండలం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల పరిస్థితి తీవ్రంగా ఉందని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డు మీద, చిన్న షాపులు దగ్గర యూనిఫారంతోనే కూర్చొని ఉండటం మొబైల్ ఫోన్స్ తో గేమ్స్ ఆడుతు కనిపించటం పట్ల ఆయన విద్యాశాఖ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పాఠశాలల్లో ఉండే విద్యార్థులకు బోధకులు సక్రమంగా బోధించాలి, కానీ ఉపాధ్యాయులు ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు సక్రమంగా తరగతి గదులలో ఉండకుండా బయట ప్రాంతాలలో ఉండడంతో చెడు వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఉందన్నారు. ఇది కేవలం గిరిజన పిల్లల సమస్య మాత్రమే కాదు, సమాజ సమస్య అని ఆయన ఘాటుగా పేర్కొన్నారు. పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు, వసతి గృహాలు లేకపోవడం, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడం కారణంగానే విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారు. విద్యార్థులతోనే పని చేయించడం, వారి భవిష్యత్ పౌరులుగా ఎదగడానికి అవకాశాలు ఇవ్వకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యం అని ఆయన అన్నారు. మండల కేంద్ర పాఠశాలల్లో పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా మారడం లేదు. బోధకుల సమయపాలన లోపం, మౌలిక సదుపాయాల లేమీ, తల్లిదండ్రుల సమన్వయం లేకపోవడం విద్యార్థుల భవిష్యత్ పై భయంకర ప్రభావం చూపుతోంది. తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డు మీద చిన్న షాపులు దగ్గర కూర్చుని గేమ్స్ ఆడడం, చదువులో తగ్గుదల సక్రమ చర్యలు తీసుకోకపోవడం వల్లే జరుగుతోందనీ ప్రతిపాదించిన పరిష్కారాల్లో పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయులు తరగతులలో విధులు సక్రమంగా నిర్వహించడానికి ప్రభుత్వం పగడ్బందీ ఆదేశాలు జారీ చేయడం, వసతి గృహాల అభివృద్ధి, విద్యార్థుల భద్రతా క్రమాలు మెరుగుపరచడం, తల్లిదండ్రుల సమన్వయంతో పాఠశాల పర్యవేక్షణను సక్రమం చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లలు పాఠశాల తరగతులలో కాకుండా రోడ్డు మీద కూర్చుని ఉంటే, ఇది ఎవరి నిర్లక్ష్యమని ఆయన ప్రశ్నించారు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అందువల్లే విద్యార్థులు పాఠశాల వెలుపల కనిపిస్తున్నారని అన్నారు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవడం ద్వారా గిరిజన విద్యార్థుల భవిష్యత్ కాపాడవచ్చని ఆయన చెప్పారు. ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే, పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులుమూడు వైపులా సమస్యలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు

## కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అఖిలపక్ష నాయకులతో తహసీల్దార్ సమావేశం





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలో 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో రద్దీ తగ్గించేందుకు ఎన్నికల కమిషన్ సూచనల మేరకు కొత్తగా 11 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో, దీనిపై సూచనలు సేకరించేందుకు మండల తాసిల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి తహసిల్దార్ హెచ్. అన్నాజీ రావు అధ్యక్షత వహించారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు హాజరై కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. తహసిల్దార్ అన్నాజీ రావు మాట్లాడుతూ, “ఓటర్లకు మరింత సౌలభ్యం కల్పించడం, పారదర్శక ఎన్నికల నిర్వహణ మా ప్రధాన లక్ష్యం. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ప్రతి పార్టీ సూచనల్ని పరిగణనలోకి తీసుకుంటాం” అని అన్నారు.

## కడుతులలో “రైతన్నా! మీకోసం” కార్యక్రమం



- ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి.
- సచివాలయం హార్టికల్చర్ అసిస్టెంట్ ఎండన్న.
- ఐసిఆర్ పి జై జగన్నాథం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 27.** మండలంలో గల పనసపుట్టు పంచాయితీ, కడుతుల గ్రామంలో “రైతన్న! మీకోసం” కార్యక్రమం నిర్వహించినట్లు జోలపుట్టు సచివాలయం హార్టికల్చర్ అసిస్టెంట్ ఎండన్న, ఐసిఆర్ పి జూర్లోయి జగత్ రాయి తెలిపారు. ఈ సందర్భంగా వారు గురువారం మాట్లాడుతూ.. కడుతుల గ్రామంలో నిర్వహించిన రైతన్న! మీకోసం కార్యక్రమంలో 65 మంది రైతులు పాల్గొన్నారని, వారిని ప్రకృతి వ్యవసాయ సేద్యం గూర్చి వివరించమన్నారు. రైతు వీడు భూములో మొక్కలు నాటాలని, సమాజంలో నేడు మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలన్నారు. చిరుధాన్యాలు, రాగులు, జొన్నలు కొర్రలు వంటి వాటికి డిమాండ్ ఉన్న నేపథ్యంలో వాటిని మరింత సాగు చేయాలని, ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున అవలంబించాలన్నారు. సబ్సిడీతో కూడిన వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ట్రాక్టర్, టార్పలిన్లు, పవర్ వీడర్, రైతులకు రాయితీతో ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. సిల్వర్, డ్రాగన్ మొక్కలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, గంజాయి జోలికి ఎవరు వెళ్లకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ కే గోపాల్, పెసా కమిటీ ఉపాధ్యక్షులు కిరసాని లొక్కిరామ్, పెసాకార్యదర్శి కిముడు రామదాసు, గ్రామస్తులు రాజేష్, రామ నాయుడు, నాగేంద్ర, రత్నమ్మ, పద్మ, కలిమోని, సొమ్ర తదితరులు పాల్గొన్నారు.

# రింతాడలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 27**: గూడెం కొత్త వీధి మండలంలోని రింతాడ పంచాయతీ పరిధిలోని వర్మీ కంపోస్ట్ కేంద్రం వద్ద మండల పరిషత్ నిధులతో రూ. 2 లక్షల వ్యయంతో నిర్మించనున్న బోరు పనులకు స్థానిక సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి బోరు త్రవ్వకం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జీ.కే. వీధి వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ, కూటమి నాయకులు, ఏఎంసీ డైరెక్టర్ చింతపల్లి, టిడిపి రింతాడ గ్రామ కమిటీ అధ్యక్షులు మొట్టడం శరభన్న దొర, టిడిపి సీనియర్ నాయకులు సాగిన రంగారావు, వైసిపి సీనియర్ నాయకులు బొబ్బిలి లక్ష్మణ్,బొబ్బిలి వెంకట్రావు, రామ్మూర్తి, చందు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఎయిడ్స్ పై అవగాహన సదస్సు.



**అరకులోయ పెన్ పవర్ 27:** కమిషనరేట్ ఆఫ్ కాలేజీఏట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అరకులోయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ అధ్యక్షతన డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోస్టర్ పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. అదేవిధంగా మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటువంటి పోటీలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఎయిడ్స్ వ్యాధి పట్ల మరింత అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్.పి. కొండబాబు మెంబర్స్ పి.సుందరి రాణి, ఎం. అనిత కుమారి అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


## మొదటి గురువారం పూజలతో కనకమహాలక్ష్మి మార్గశిర ఉత్సవాల ఆరంభం





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27** :విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసో త్సవాలు ఈరోజు తొలి గురువారం పూజలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. దక్షిణ నియోజ కవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పద్మజ దంపతులు అమ్మవారి గర్భాలయంలో పంచా మృతాభిషేకాలతో పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.
ఆలయ ఈవో శోభారాణి, ఉత్సవ కమిటీ స భ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆలయ మండపంలో ఆశీ ర్వచనం చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అంద జేశారు. పూజలు పూర్తయ్యాక అలయ దర్శన వైదికాలు ప్రారంభించడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ,మొదటి గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ముందస్తు ప్రణాళికతో తగిన ఏర్పాట్లు చేశాం. అదనపు సిబ్బంది, భద్రతా చర్యలు, క్యూ లైన్ నిర్వహణ వంటి అన్ని ఏర్పాట్లను విస్తృతంగా అమలు చేశాం, అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్, కూటమి నేతలు, పోలీసు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## 66 వార్డ్ అభివృద్ధి పనులు వేగవంతం



**గాజువాక :పెన్ పవర్ ,నవంబర్ 27**
మహా విశాఖ నగర పాలక సంస్థ 66 వార్డులో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం సమపాల్లుగా అందిస్తున్న కూటమి ప్రభుత్వం . వార్డులో ఎన్నో ఏళ్లగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని శిథిలమైపోయిన పనులన్నీ సరే వేగంగా జరుగడం విశేషం . రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వర్కుల్ని కైలాష్ నగర్ లో, ఇందిరా కాలనీలో, బీసీ రోడ్లో, రోడ్డు వర్కుల్ని, పెద్ద కాలవల్ని, దగ్గరుండి, కాంట్రాక్టర్లతోని క్వాలిటీ కంట్రోల్ వాళ్ళని వార్డు వర్క్ ఇన్స్పెక్టర్ ని కలిసి పనులని 66వ వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు, సీనియర్ తెలుగుదేశం నాయకులు వార్డు ట్రెజరర్, లక్ష్మణరావు, వార్డు మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ భాష, వర్క్ ఇన్స్పెక్టర్ గంగాధర్ తో కలిసి పరిశీలించారు . పరిపాలన అంటే సంక్షేమ%శీ% తో పాటు, అభివృద్ధి, ప్రజలు భద్రత, పిల్లల భవిష్యత్తు, సుపరిపాలనకు నిదర్శనం అని పలువురు కితాబునిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కి పారిశ్రామిక ప్రాంత వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .

## సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద ఉదయం విషాదం

### రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** లక్ష్మివారం తెల్లవారుజామున విశాఖ పశ్చిమ, గోపాలపట్నం పెట్రోల్ బంక్, సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. సంఘటన సుమారు ఉదయం 5.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. ప్రారంభ సమాచారం ప్రకారం, ఆ వ్యక్తి బస్సు కింద పడటంతో గానీ, బస్సు ఢీకొట్టడంతో గానీ తీవ్ర గాయాలు పొందాడు. ప్రయాణికులు, స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించకపోవడంతో, అతని వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రజల సహాయం కోరుతున్నారు. ఈ వ్యక్తి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు కింది నెంబర్లకు సమాచారం ఇవ్వవలసిందిగా పోలీసులు విజ్ఞప్తి చేశారు. గోపాలపట్నం సీఐ నెం.9440796020, ఎస్సై నెం.83310 41648 పోలీసులు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణం పరిసీలించడంతో పాటు, బస్సు డ్రైవర్ మరియు ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారిని కూడా విచారిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలన కూడా జరుగుతోంది.

## పశ్చిమ 89వ వార్డులో ఘనంగా మౌర్యసింహ జన్మదిన వేడుకలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** జీవీఎంసీ 89 వ వార్డు, కొత్తపాలెంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు తనయుడు, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మౌర్యసింహ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కొత్తపాలెం పిఎసిఎస్ చైర్మన్, వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్ కుమార్ సౌజన్యంతో ఈ వేడుకలు ఘనంగా జరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జన్మదిన శుభాకాంక్షలు అందుకున్న మౌర్యసింహ హాజరయ్యారు. వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు, ట్రాఫిక్ సీఐ సురేష్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పార్టీ నాయకులు, కార్యకర్తల సందడి..**

ఈ సందర్భంగా మౌర్యసింహతో కలిసి నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, స్థానిక కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరై వేడుకలకు ప్రత్యేక రంజు కలిగించారు. నాయకుల్లో దాడి సురేష్, పెప్సీ రమణ, శెట్టి గోపి, గవ్వ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**సామాజిక సేవపై దృష్టిమౌర్యసింహ..**

ఈ సందర్భంగా మౌర్యసింహ మాట్లాడుతూ, పార్టీ సేవలకోసం యువత మరింతగా ముందుకు రావాలని, ప్రజాభివృద్ధి కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తామని ఆశయాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. స్థానిక ప్రజల నుంచి అభినందనలు అందుకున్న ఆయన, పార్టీ బలోపేతం కోసం నిరంతర కృషి చేస్తామని తెలిపారు.

**స్థానిక రాజకీయాలకు బలం..**

ఈ వేడుకలో యువత, పార్టీ అనుబంధ సంఘాలు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా స్థానిక రాజకీయ వాతావరణంలో టీడీపీకి పెరుగుతున్న ఆదరణ స్పష్టమైందని స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలా వర్గ సంబంధాలు బలోపేతం చేయడం పార్టీకి భవిష్యత్తులో మేలు కలిగిస్తుందని అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించి 500 మందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని స్థానిక టిడిపి నాయకులు కలిసి నిర్వహించాయి. హెల్మెట్ల పంపిణీతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నిర్వాహకులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

## విశాఖ పశ్చిమలో ఘనంగా మౌర్యసింహా జన్మదిన వేడుకలు

### ప్రజాకర్షణ, రాజకీయ సంకేతాలతో అంగరంగ వైభవంగా వేడుకలు







**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** విశాఖపట్నం, గోపాలపట్నం ప్రాంతంలోని ఇండోర్ స్టేడియం, జడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు కుమారుడు, టీడీపీ యువనేత మౌర్యసింహా జన్మదిన వేడుకలు శనివారం భారీగా నిర్వహించాయి. ఈ వేడుకలు కేవలం పుట్టినరోజు సందర్భం మాత్రమే కాకుండా, స్థానిక రాజకీయ సమీకరణలు, యువతను ఆకర్షించే కృషి, రెండు పార్టీల కూటమి కలిసికట్టుగా పనిచేస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపించాయి.

**క్రీడా కార్యక్రమంతో ప్రజల్లోకి షటిల్ టోర్నమెంట్ ఆకర్షణ..**

మౌర్యసింహా జన్మదినం సందర్భంగా ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
విజేతలకు మౌర్యసింహా, విశాఖ పశ్చిమ నియోజకవర్గం జనసేన నాయకురాలు అంగ దుర్గ ప్రశాంతి చేతుల మీదుగా బహుమతులు, షీల్డులు అందజేయడం టిడిపి, జనసేన కూటమి అనుబంధాన్ని బలోపేతం చేసే సూచనగా స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. క్రీడల ద్వారా యువతను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇది యువజనంతో మౌర్యసింహా మధ్య అనుబంధాన్ని పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తులో నాయకత్వంపై ఆయన కలిగించే ప్రభావాన్ని కూడా సూచించే అంశంగా కనిపించింది.

**కార్యాలయ వేడుకలు.. స్థానిక నాయకుల ఐక్యతకు వేదిక..**

తదనంతరం విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమానికి టీడీపీ కార్పొరేటర్లు, కూటమి నేతలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ హాజరు స్థానికంగా మౌర్యసింహా ప్రభావం పెరుగుతోందనే సంకేతంగా భావించబడుతోంది. పార్టీ కార్యకర్తల నుంచి అభిమానుల వరకు విస్తృత హాజరు ఉండటం, ప్రజల్లో మౌర్యసింహా పట్ల ఉన్న ఆదరణను ఆవిష్కరించింది.

**ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' – మౌర్యసింహా స్పందన..**

జన్మదిన వేడుకల సందర్భంగా మాట్లాడిన మౌర్యసింహా నాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు. మీ ప్రేమ, ప్రోత్సాహం నాకు ప్రజాసేవలో మరింత బలాన్నిస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు యువ నాయకునిగా ఆయన సేవా దృక్పథాన్ని మరియు ప్రజలతో అనుబంధాన్ని పెంచుకునే ప్రయత్నాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్లు, కూటమి నేతలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్రీడాకారులు పాల్గొనడం గమనార్హం. విభిన్న వర్గాల హాజరు కూటమి అంతర్గత ఐక్యతకు, మౌర్యసింహా వ్యక్తిగత ప్రజాదరణకు సూచనగా కనిపిస్తోంది.
ఈ వేడుకలలో మూడు ప్రధాన అంశాలు స్పష్టంగా వెలుగులోకి వచ్చాయి. కూటమి సమన్వయ బలపరచడం, జనసేన నాయకురాలు అంగ దుర్గ ప్రశాంతి పాల్గొనడం బహుమతులు అందజేయడం. టీడీపీ, జనసేన కూటమి అనుకూల వాతావరణాన్ని పునరుజ్జీవింపజేసే ప్రయత్నంలా కనిపించింది. యువతను ప్రోత్సహించే రాజకీయ వ్యూహం. షటిల్ టోర్నమెంట్ వంటి క్రీడా కార్యక్రమాలు యువతను ఆకర్షించే, వారితో అనుబంధాన్ని పెంచుకునే చర్యగా చూడవచ్చు. మౌర్యసింహా పట్ల పెరుగుతున్న మద్దతు. విభిన్న వర్గాల భారీ హాజరు ఆయనను భవిష్యత్తు నాయకుడిగా నిలపాలన్న పార్టీ యాజమాన్యం వ్యూహానికి బలం చేకూరుస్తోంది. విశాఖ పశ్చిమలో మౌర్యసింహా జన్మదిన వేడుకలు కేవలం వేడుకలుగానే కాకుండా రాజకీయ సందేశాలు, కూటమి ఐక్యత, యువత ఆకర్షణ, పార్టీ బలోపేతం వంటి అంశాలతో కూడిన కార్యక్రమాలుగా నిలిచాయి.

# విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో సీ.ఎం.రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు సోమవారం 91, 92, 89, 40, 90, 57వ వార్డులకు చెందిన పలు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. వైద్య కారణాల వల్ల బాధపడుతున్న మరియు అత్యవసర వైద్య సహాయం అవసరమైన కుటుంబాలకు ఈ చెక్కులు అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా గణబాబుమాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స అందడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తోంది. ఈ నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకుని వైద్య సేవలు పొందాలని ప్రతి లబ్ధిదారు గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు.

అలాగే పార్టీలకు అతీతంగా, కేవలం అర్హతను ప్రమాణంగా తీసుకుని మాత్రమే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేస్తున్నాము. అవసరమైన వారికి సహాయం అందేలా ప్రభుత్వంగా, వ్యక్తిగతంగా కృషి చేస్తూనే ఉంటామని గణబాబు పేర్కొన్నారు.

లబ్ధిదారుల వివరాలు..

యండమూరి సురేష్ రూ.లక్ష 30వేల,524లు, కర్రీ అన్నపూర్ణ రూ.28 వేల 400లు, పసి లావణ్య 2 లక్షల, 32 వేల, 857లు, కాకర హారిక రూ.25 వేల,650లు, ఏ.ఏ. సూరిదేముడు రూ.28 వేలు, వి.వెంకట శ్యామల రూ.20 వేల, 524లు, మిండి అప్పలరాజు రూ.లక్ష, ఒక వెయ్యి,762లు, ఎస్. పాండా రూ.84వేలు,928లు, తుంపల శ్రీనివాసరావు రూ.49వేలు,067లు, పి. కృష్ణవేణి సాహు రూ.75 వేలు, మొత్తం మంజూరైన రూ.7 లక్షల,76వేలు,717లు పంపిణీ చేశారు.

లబ్ధిదారుల కృతజ్ఞతలు..

సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన నిధులు తమకు చేరేలా ప్రత్యేకంగా కృషి చేసిన గణబాబుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మరియు కూటమి నాయకులు బొడ్డెటి విజయ్, పెంటకోట అజయ్ బాబు, పొన్నాడ రమణరావు (పెప్సి రమణ), గవ్వ భాస్కర్, అంగటి మూర్తి, తతబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా యువ నాయకుడు మౌర్య సింహ జన్మదినోత్సవ వేడుకలు

ఐజీఎం ఆధ్వర్యంలో భక్తి, భావాలతో ప్రత్యేక కార్యక్రమాలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** పశ్చిమ నియోజకవర్గం, జీవీఎంసీ 91వ వార్డు పరిధిలోని ఇన్ గ్లోరీ మినిస్ట్రీస్ (ఐజీఎం) ఆధ్వర్యంలో యువ నాయకుడు మౌర్య సింహ జన్మదినోత్సవ వేడుకలు గురువారం అత్యంత శోభాయమానంగా నిర్వహించబడ్డాయి. స్థానిక బెత్తసస్తా చర్చి ప్రాంగణం పూలతో అలంకరించబడి పండుగ వాతావరణాన్ని తలపించింది. రంగురంగుల లైటింగ్, అలంకరణలు, భారీ హోర్డింగ్స్, శుభాకాంక్షా బ్యానర్లు చర్చి ప్రాంతం మొత్తం సందడి వాతావరణాన్ని మరింతగా పెంచాయి.

వేడుకలలో భాగంగా చర్చి పెద్దలు, క్రైస్తవ సంఘ కాపరులు, ఐజీఎం నాయకులు కలిసి మౌర్య సింహకి ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థనలు జరిపారు. ఆ తరువాత చర్చి పెద్దల సాక్షిగా జన్మదిన కేక్ కట్ చేయబడింది. పలువురు నాయకులు, విశ్వాసులు వరుసగా మౌర్య సింహని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మౌర్య సింహ మాట్లాడుతూ

ఇలాంటి పవిత్ర స్థలంలో నా పుట్టినరోజును జరుపుకోవడం నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సందర్భం. మీ అందరి ప్రార్థనలు, ఆశీర్వాదాలు, ప్రేమ నాకు మరింత సేవా స్ఫూర్తిని, ప్రజా సేవ పట్ల నిబద్ధతను పెంచుతున్నాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా మరింత శ్రద్ధగా పనిచేస్తానని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వేడుకలకు తెలుగుదేశం క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు శ్రీ కుమార్, ఐజీఎం పెద్దలు, స్థానిక క్రైస్తవ సంఘ నాయకులు, యువత, విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం మొత్తం భక్తి%–%భావాలతో సాగి, పాటలు, స్తోత్రాలతో చర్చి ప్రాంగణం ఉత్సాహంగా మారింది. రోజంతా కొనసాగిన ఈ వేడుకలు ఆ ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక, ఆనందోత్సాహభరితమైన అనుభూతిని అందించాయి.

# సింహాచలంలో భక్తుని అపూర్వ దాతృత్వం

శ్రీ సింహాద్రినాథ శాశ్వత నిత్యఅన్నప్రసాద నిధికి లక్షా పదహారు విరాళం



**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 27 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల దాతృత్వ పరంపర కొనసాగుతోంది. భక్తులు స్వామివారి సేవలో భాగమవుతూ, ముఖ్యంగా నిత్యాన్నదానం వంటి మహాదాతృత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ భక్తి, సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడకు చెందిన పేతల రామకృష్ణ, నూకరత్నం స్వామివారి శాశ్వత నిత్యఅన్నప్రసాద నిధికి రూ. లక్ష ,16లు విరాళం అందజేసి ఒక నిలకడైన సేవా సంప్రదాయానికి మరొక అధ్యాయం జోడించారు. దంపతులు స్వయంగా సింహాచలం దేవస్థానం ప్రోటోకాల్ కార్యాలయంలోని విరాళ కౌంటర్ వద్ద నగదు రూపంలో విరాళాన్ని సమర్పించారు. దేవస్థాన అధికారులు అందుకున్న మొత్తానికి అనుగుణంగా రసీదు జారీ చేశారు. అనంతరం, దేవస్థానం సీనియర్ సహాయకులు సూర్యనారాయణ బాండ్ దంపతులకు అందజేశారు. విరాళ సమర్పణ అనంతరం దంపతులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించబడింది. వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేస్తూ దాతృత్వ గుణాన్ని ప్రశంసించారు. దేవస్థానం తరపున దంపతులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

దేవస్థానం అధికారులు మాట్లాడుతూ పేతల రామకృష్ణ, నూకరత్నం దంపతుల దాతృత్వం నిత్యఅన్నప్రసాద పథకాన్ని మరింత బలపరుస్తుంది. ఇలాంటి భక్తుల సేవాభావం స్వామివారి సేవలో ఒక ప్రేరణాత్మక ఆదర్శమని అభినందించారు. దేవస్థానం తరపున దంపతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపి, భక్తులందరికీ శ్రీ సింహాద్రి నాధుని కటాక్షం చేకూరాలని ఆకాంక్షించారు.

# విజయవాడ పాలకమండలి సభ్యులు కరిగొప్పల పార్వతికి ఘన సత్కారం






**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యులు కరిగొప్పల పార్వతి మరియు హుస్సేన్ బాబు విశాఖపట్నం వచ్చిన సందర్భంగా మల్కాపురం జేఏసీ నాయి బ్రాహ్మణ సేవా సంఘం జోనల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘన సత్కారం నిర్వహించారు. మేళతాళాల మధ్య, పరంపరాగత ఆతిథ్యంతో, సంఘ ప్రతినిధులు ఇద్దరు సభ్యులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి అభినందనలు తెలియజేశారు. సత్కార కార్యక్రమంలో మాట్లాడుతూ పాలకమండలి సభ్యురాలు కరిగొప్పల పార్వతి ఆమెకు లభించిన గౌరవానికి హర్షం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఆతిథ్యం అందించిన నాయి బ్రాహ్మణ సంఘానికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ బాధ్యతను నాకు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి ప్రథమంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీరు చూపిన విశ్వాసానికి, చూపిన గౌరవానికి నేను రుణపడి ఉంటాను. భవిష్యత్తులో ఈ బాధ్యతను నెరవేర్చేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని పార్వతి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ముసిడిపల్లి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ గోల్కొండ కరుణాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పూలేటుకుర్తి సూర్యారావు, జోనల్ అధ్యక్షులు గోల్కొండ రామకృష్ణ, ఉపాధ్యక్షులు సాంబశివరావు, తుంపాల శంకర్రావు, సహాయ కార్యదర్శి రేజేటి ఆర్.కృష్ణ తదితరులు హాజరై అభినందనలు తెలిపారు. సంఘ ప్రతినిధుల సమక్షంలో సత్కారం సందడి వాతావరణంలో సాగగా, దేవస్థానం పాలకమండలి సభ్యుల పర్యటనకు స్థానికులు కూడా మంచి స్పందన వ్యక్తం చేశారు.

# మహిళల రక్షణ మరియు భద్రత పై అవగాహన

- బ్రాండిక్స్ కంపెనీలో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం





**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 27 :** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పోలీసులు బ్రాండిక్స్ కంపెనీలో మహిళా ఉద్యోగుల కోసం మహిళా భద్రత, చట్టాలు, సైబర్ భద్రత వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ

ఈ.శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్ నీలిమ, వన్ స్టాప్ సెంటర్ ఎస్సై రాములమ్మ పాల్గొని కీలక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా చట్టాలు, మహిళా రక్షణకు సంబంధించిన నూతన క్రిమినల్ చట్టాలు, గృహహింస వంటి ముఖ్యమైన చట్టాలపై అవగాహన కల్పించారు.

పోక్సో చట్టం, బాలికలపై నేరాలను నిరోధించడానికి ఉన్న నిబంధనలు, శిక్షలు, శక్తి యాప్ వినియోగం, అత్యవసర సమయంలో పోలీసులు వెంటనే సహాయం అందించే విధానం తెలిపారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, హరాస్‌మెంట్, సోషల్ మీడియాలో పాటించాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రత, ఉద్యోగులకు, మహిళా కార్మికులకు అవసరమైన ట్రాఫిక్ నియమాలు, మాదక ద్రవ్యాల ముప్పు, డ్రగ్స్ వాడకం వలన కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలు యువత, ఉద్యోగులు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు పోలీసు శాఖ చేపడుతున్న మహిళా భద్రతా చర్యలను అభినందిస్తూ, తమ హక్కులు మరియు రక్షణ నిబంధనలపై విలువైన అవగాహన పొందారు.

# రాష్ట్రంలో వైసీపీ పునరుదయం స్పష్టంగా కనిపిస్తోంది



**మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27 :** దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వ్యాఖ్యానించారు. భవిష్యత్ పూర్తిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా మలుస్తోందని, ప్రజల్లో వైసీపీపై విశ్వాసం మరింత బలపడు తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఇప్పు డే ఎన్నికలు జరిగితే రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ సంచలనాత్మక విజయాన్ని నమోదు చేయ గలదని అన్నారు. 27వ వార్డు అధ్యక్షుడు సర్వే శ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల నాయకులను వార్డు, బూత్ కమిటీల్లో చేర్చిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వాసు పల్లి గణేష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి తమ స్వప్రయో జనాల దిశగా పాలన సాగిస్తున్నారని ఆరోపిం చారు. ఈ ప్రభుత్వం ప్రజలకు చేయిందేమీ లేదని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే శక్తి వైసీపీకే ఉందని గణేష్ కుమార్ స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలలో వైసీపీ భారీ మెజారిటీతో గెలిచి మరోసారి సంచలనం సృష్టిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, పార్టీ కోసం నిబద్ధతతో శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు.

# 87వ వార్డులో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ లైన్ త్వరగా పూర్తి చేయాలని వినతి

**కూర్మన్నపాలెం : పెన్ పవర్ ,నవంబర్ 27**

జీవీఎంసీ 87 వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో జీవీఎంసీ, జోన్–6, కమీషనర్ ,

ఏ.డీ. ఇ ఏ పీ ఇ పి డీ సీ యల్ ను కలసి 87వ వార్డులో జరుగుచున్న అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ లైన్ వర్క్ వడ్లపూడి మెయిన్ రోడ్డులో జరుగుతుంది. ఈ పనివలన మెయిన్ రోడ్డులో నివాసము వున్న వారికి దుమ్మి, ధూళి వలన ప్రజలు, వ్యాపారస్థులు అలాగే ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉందని చాలా ఇబ్బందులు పడుచున్నారు, తక్షణము విద్యుత్ అండర్ గ్రౌండ్ వర్క్ త్వరతగతిన పూర్తిచేయాలనీ జోనల్ కమీషనర్ , ఏ. డీ. ఈ ఎలక్ట్రికల్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వై సి పి నాయకులు తెలిపారు . ఈ కార్యక్రమం లో 87వ వార్డు వైస్సార్సీపీ ప్రెసిడెంట్ బి . గోవింద్ , వెంకటరమణ, శ్రీనివాసరావు, దామోదర్ రావు, దానప్పలు, రాము, సత్తిబాబు,తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ దత్తత అవగాహన సదస్సు 2025



విశాఖపట్నంలో ప్రారంభించిన కేంద్ర కార్యదర్శి అనిల్ మాలిక్




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27 :**మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎండబ్ల్యుసిడి ఆధ్వర్యంలోని కేంద్ర దత్తత వనరుల అథారిటీ సి ఎ ఆర్ ఎ మరియు ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ దత్తత అవగాహన సదస్సు 2025 గురు వారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వై.వి.ఎస్. మూర్తి ఆడిటోరియంలో ప్రారంభమైంది. సద స్సును కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మం త్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ మాలిక్ ఆరంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎ. సూర్య కుమారి, తెలంగాణ సమాన శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామ చంద్రన్, సి ఎ ఆర్ ఎ సభ్య కార్యదర్శి %aు% సీఈవో భావన సక్సేనా, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, జువెనైల్ వెల్ఫేర్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.దేశవ్యాప్తంగా దత్తత ప్రక్రియలో పారదర్శకత, భద్రత, బాలల శ్రేయస్సు వంటి అంశాలపై అవగాహన పెంపు లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించబడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ విభాగాల నిపుణులు, వాలంటరీ సంస్థలు, పాలసీ మేకర్లు పాల్గొని దత్తత విధానాల బలోపేతంపై చర్చించారు.

## ధారకొండలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టిడిపి మండల స్థాయి సమావేశం





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,నవంబర్ 27:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికను దృష్టిలో ఉంచుకొని, టిడిపి మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు ఆధ్వర్యంలో దారకొండలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని నాలుగు పంచాయతీలు దారకొండ, దుప్పలవాడ, గుమ్మిరేవుల, సీలేరు గ్రామ కమిటీ అధ్యక్షులు మరియు అనుబంధ కమిటీలకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో నెట్‌వర్క్ విస్తరణ, బూత్ స్థాయి కార్యాచరణ, స్థానిక ఎన్నికల్లో పార్టీ వ్యూహాలు వంటి అంశాలపై నాయకులకు మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, ఏఎంసీ డైరెక్టర్ మొట్టడం శరభన్న దొర, సంకాడ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.వి.వి.ఎస్.ఎన్. ప్రసాద్, రింతాడ ప్రధాన కార్యదర్శి సాగిన రంగారావు, మాజీ తెలుగు యువత అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు, మండల కోశాధికారి తగ్గి శ్రీరాములు, యూనిట్ ఇంచార్జ్ మామిడి చంటిబాబు, ముర్ల భూపతి, ఉపాధ్యక్షులు పాడి శ్రీనివాసరావు, అలాగే నాలుగు పంచాయతీల గ్రామ కమిటీ అధ్యక్షులు శోభ జగన్, పోతురాజు గోవిందరావు, పోతురాజు కృష్ణ, కే. ధర్మారరావు, సప్పల సత్యమూర్తి, యూనిట్ ఇంచార్జ్‌లు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శన భాగ్యం

- అమ్మవారి మొదటి గురువార పూజా కార్యక్రమాలకు పోటెత్తిన భక్తజనం
- పాల్గొన్న కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ







**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 27:** శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆరిలోవకోలని గల కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో తొలి గురువారం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పంచామృత అభిషేకాలతో పూజలలో ఆమె పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న టీడీపీ 13 వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు దంపతులు.వైసిపి నాయకులు కేబుల్ వాసు దంపతులు. పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు ఆలయ కమిటీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సాయిబాబు,శ్రీను,కేశవరావు,ఆనందరావు,ఈశ్వర మ్మ, పైడితల్లమ్మ, సత్యవతి, సంపత్ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక భవనాన్ని ప్రారంభించిన నగర మేయర్





**విశాఖ పెన్ పవర్ నవంబర్ 27:** ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రథమ కర్తవ్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన 4వ జోన్ 37 వ వార్డు పరిధిలోని జబ్బరు తోట వద్ద సుమారు 42 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన సామాజిక భవనం రెండవ అంతస్తు ను దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ చెన్న జానకిరామ్ లతో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పన ప్రథమ కర్తవ్యం అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతుల పాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజలకు చేరువలో ఉంటుందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అందించడంలో పార్టీలకతీతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జబ్బరు తోటలోని ప్రజల అవసరాల మేరకు సామాజిక భవనానికి అదనపు అంతస్తు నిర్మించి నేడు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, జబ్బరు తోటలో సామాజిక భవనాన్ని ప్రారంభించి ఇక్కడ ప్రజలకు అందించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎమ్ .మల్లయ్య నాయుడు, జీవీఎంసీ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు, సహాయక ఇంజనీరు, సచివాలయం కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మి అమ్మవారి కృప సర్వజనానికి కలగాలి వాసుపల్లి గణేష్ కుమార్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27 :**దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వాసుపల్లి గణేష్ కుమార్ దంపతులు గురువారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ వారి దివ్యకటాక్షం ప్రతి కుటుంబానికీ శాంతి సౌభాగ్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రతి మనిషిలో ఆధ్యాత్మికత పెరగాలని, సమా జంలో పరస్పర సహాయసహకారాలు విస్తరిం చాలని ఆయన అభిలాషించారు. కోరిన వరాలు నెరవేర్చే కనకమహాలక్ష్మి అమ్మవారి మహత్యం అనేక మందిని సుసంపన్నమైన జీవితం వైపు నడిపిందని గణేష్ కుమార్ పేర్కొన్నారు.

అమ్మవారి చల్లని దృష్టి అందరిపైనా ఉండి, ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపా రు.

ఈసారి అమ్మవారిని దర్శించిన భక్తులందరికీ శుభఫలితాలే కలుగుతాయని ఆయన విశ్వా సం వ్యక్తం చేశారు.

## సరైన పత్రాలు లేని వాహనదారులకు పోలీసుల కౌన్సిలింగ్!





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 27:** గూడెం కొత్త వీధి మండల కేంద్రంలోని సంత ప్రాంతంలో వాహన తనిఖీలలో భాగంగా పోలీసులు వాహనాలపై తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు తదితర అవసరమైన డాక్యుమెంట్లు సక్రమంగా తీసుకుని తిరగాలని వాహనదారులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.తనిఖీల సమయంలో సరైన పత్రాలు లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఇటీవల తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని, యువత రాష్ డ్రైవింగ్ చేయకుండా, హెల్మెట్ ధరించడం, వాహన పత్రాలు సరిచూసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.వాహనదారుల భద్రత కోసమే ఈ తనిఖీలు చేపడుతున్నామని గూడెం కొత్త వీధి సీఐ బి.సుధాకర్,ఎస్సై సురేష్ తెలిపారు.

# కాఫీ కార్మికుల సమస్యలపై ఎండి శ్రీధర్ పర్యటన



### చింతపల్లిలో నేడు సిఐటియు నాయకులతో సమావేశం

### సిఐటీయు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 27 :-** కాఫీ తోటల కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు సిఐటీయు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు ఏపీ ఎఫ్‌డీసీ ఎండి ఎస్.ఎస్. శ్రీధర్ జిల్లాలో రెండు రోజుల పర్యటనను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. యాజమాన్యం ఈ నెల 14వ తేదీ నుంచే కూలి రేట్లు, పళ్ళ కేజీ రేట్ల పెంపు అమలు చేసినప్పటికీ, కార్మికుల మిగతా పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరుతున్నారు.మంగళగిరిలో చర్చ కార్మికుల హామీ విరమణఈ నెల 17న మంగళగిరిలోని కార్యాలయంలో సిఐటియు రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో ఎండి శ్రీధర్ సమావేశమై కాఫీ కార్మికుల సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. కాఫీ తోటలను ప్రత్యక్షంగా సందర్శిస్తానన్న ఎండి హామీ మేరకు, సమ్మెకు దిగిన కార్మికులు తాత్కాలికంగా సమ్మెను విరమించారు.

పర్యటనలో భాగంగా పాడేరు, చింతపల్లి, జికే వీధి డివిజన్ల సందర్శనహామీని నెరవేర్చుతూ ఎండి శ్రీధర్ బుధవారం,గురువారం,పాడేరు చింతపల్లి %-% జికే వీధి డివిజన్లలో పర్యటిస్తూ కాఫీ తోటల పరిస్థితులు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఉన్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు.

వేతనాలు పళ్ళ ధరల పెంపు వివరాలు వీడీఏ ఆధారంగా యాజమాన్యం సవరించిన రేట్లురోజువారీ వేతనం: రూ.321 రూ.351పళ్ళ కేజీ రేటు: రూ.6.10, రూ.6.66అయితే పళ్ళ సేకరణను కేజీ రేటుకు బదులుగా రోజువారీ వేతనంతోనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.కాఫీ తోటల రక్షణకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి, ప్రస్తుతం ఉన్న 17 ప్లాంటేషన్ కండక్టర్లు, 22 అసిస్టెంట్ కండక్టర్లు సరిపోవడం లేదని కార్మికులు తెలిపారు.నేడు చింతపల్లిలో సమావేశంలో అంశాలన్నింటిపై చర్చించేందుకు నేడు చింతపల్లిలో ఎండి శ్రీధర్ తో సమావేశమవనున్నట్లు, కాఫీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎల్. సుందర్ రావుతో పాటు పలువురు నాయకులుహాజరుకానున్నారని సిఐటియు నాయకులు తెలిపారు.

# జనవరి 14న వాడపల్లి కోనసీమ తిరుమలలో గోదాదేవి-రంగనాయకుల కళ్యాణ వైభోగం

**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 27:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిచెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రంలో ప్రతి సంవత్సరం భోగి పండుగ రోజున నిర్వహించే గోదాదేవి-రంగనాయకుల కళ్యాణ మహోత్సవం,2026 జనవరి 14న అతి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.ఈ కళ్యాణోత్సవానికి పాల్గొంటే పెళ్లి కాని యువకులు, పెళ్లి కాని యువతులకు శుభ ఫలితాలు కలుగుతాయని, వివాహయోగం త్వరగా కలుగుతుందని శాస్త్రోక్త నమ్మకం ప్రజల్లో బలంగా నెలకొని ఉంది. అందువల్ల ప్రతి సంవత్సరం వేలాది మంది యువత, యువకులు, వారి కుటుంబాలతో కలిసి ఈ వేడుకలో పాల్గొంటారు.

ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పుష్పాలంకరణ, వేదపండితుల మంగళ వాద్యాలు, శాస్త్రోక్త కర్మకాండల మధ్య స్వామివారి సాక్షిగా గోదాదేవి-రంగనాయకుల కళ్యాణం అత్యంత ఘనంగా జరుగనుంది.ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ,భోగి పర్వదినం రోజున జరిగే గోదాదేవి-రంగనాయకుల కళ్యాణంలో పాల్గొంటే శ్రీమాలక్ష్మీవారి అనుగ్రహం కలుగుతుందని, వివాహయోగం త్వరగానే ఏర్పడుతుందని భక్తుల్లో ప్రగాఢమైన విశ్వాసం ఉంది.



అందుకే ప్రతి భక్తుడు ఈ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కటాక్షం పొందాలని కోరుతున్నాం" అని తెలిపారు.
తేదీ దగ్గరపడుతున్నకొద్దీ వాడపల్లి క్షేత్రంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలియజేశారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మండల యుటిఎఫ్ శాఖ చేయూత






**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్27:**ఆత్రేయపురం గ్రామంలోని ఎం.పి.పి.పి.ఎస్ చినపేట ప్రాంతంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పమ్మి శాంతకుమారి తాటాకిల్లు పూర్తిగా కాలిపోయి దగ్ధమైంది. కుటుంబం ఆర్థికంగా తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారికి అండగా నిలుస్తూ మండల యుటిఎఫ్ శాఖ ముందుకు వచ్చింది.మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు పి. త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. జ్యోతి బసు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి జీవనావసరమైన సహాయక సామాగ్రిని అందజేశారు. యుటిఎఫ్ లక్ష్యాలలో భాగమైన సామాజిక స్పృహను ప్రతిబింబిస్తూ, బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వంటసామాగ్రి, దుప్పట్లు తదితరంగా రూ. 2,500 విలువ చేసే సరుకులను యుటిఎఫ్ మండల శాఖ అందించింది.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. జ్యోతి బసు, ఎఫ్.డబ్ల్యూ.ఎస్ డైరెక్టర్ ఎస్.వి.వి.ఎన్.ఎస్ ప్రసాద్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు టి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. సుధాకర్ బాబు, కోశాధికారి కడలి ప్రసాద్, అలాగే ఆఫీస్ బ్యారర్లు కందుల గోవిందరావు, చిప్పాడ సత్యనారాయణ, సబ్బెల్ల సత్యనారాయణ రెడ్డి, కొండేపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 27:**మండల పరిధిలోని సంధిపూడి గ్రామంలో సర్పంచ్ తోట భవానీ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో నూతన సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఎనర్జీఎస్ నిధుల ద్వారా రూ.43.60 లక్షలు వ్యయంతో నూతన సచివాలయ భవనం నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామంలోని ప్రజలు, రైతులు, సచివాలయం సేవలను వినియోగించుకోవాలన్నారు. అలాగే సచివాలయం అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి,గ్రామ టిడిపి అధ్యక్షుడు సూరపురెడ్డి పట్టాభి రామయ్య, ఎంపిటిసి సభ్యురాలు తోలేటి సంతోషి, ప్రముఖ వ్యాపారవేత్త వట్టికూటి సతీష్, పినపళ్ళ సర్పంచ్ సంగిత సుభాష్,సోసైటి అధ్యక్షులు వంటిపల్లి సతీష్,నల్లా వెంకన్న, కొత్తపల్లి నగేష్,ఈదల నల్లబాబు, వైట్ల గంగరాజు,ఈదల రాంబాబు, మానేనల్లి శ్రీనివాస్, రామానుజుల శేషగిరిరావు, ముప్పరి వెర్రియ్య, వాసా కాశీ,పామర్తి ఆంజనేయులు, అంగర ఏసు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మొయ్యటి నారాయణ



**ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 27 :**ప్రత్తిపాడు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మొయ్యటి నారాయణ నియమితులయ్యారు. నియోజక వర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో జరిగిన పార్టీ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు అలీ మేది, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం. సూర్యప్రకాశ్‌రావు లు నారాయణకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నూతన అధ్యక్షుడు కృషి చేయాలని సూచించారు. యువతను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు చేపట్టాలని, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి పార్టీ తీసుకుంటున్న చర్యలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఎంపికైన మొయ్యటి నారాయణను పిసిసి సభ్యుడు ధర్నాలకోట శ్రీను, మండల అధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కొల్లు వీరగణేష్, నాగం బుల్లి వెంకన్నదొర, భీమరాజులు తదితరులు అభినందించారు.

# ఆదివాసి కొండరెడ్లసంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం

కొండరెడ్లసంఘం చింతూరుడివిజన్,అధ్యక్షులు ముర్లకనకారెడ్డి




**వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్.27** మండలంలోని జీడిగుప్ప గ్రామంలోగురువారం కనుగల చిన్న శ్రీనివాస్ రెడ్డి,అధ్యక్షతనలోఆదివాసికొండరెడ్ల సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈసందర్భంగా ఆదివాసికొండరెడ్ల సంఘం చింతూరు డివిజన్ అధ్యక్షులు ముర్ల కనకారెడ్డి మాట్లాడుతూ పోలవరంనుజిల్లాగా రంపచోడవరంను కేంద్రంగాఏర్పాటు చేసినందుకు కొండరెడ్ల,గిరిజనుల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలుతెలిపారు. చింతూరు డివిజన్,పరిధిలోని ఉన్న ఐ.టి.డి.ఏ.ప్రాజెక్టు కార్యాలయంలోసంబంధితఅధికారులుద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా చూడాలని, ఐ.టి.డి.ఏ.కార్యాలయాలో పి.వి.టి.జి.కొండరెడ్లతెగకు సంబంధించిన గిరిజనులకుప్రత్యేక నిధులు కేటాయించి ఆర్థికంగాసహాయం సహకారంఅందించాని,గిరిజనులకు తొంబైశాతం సబ్సిడీ యూనిట్స్ మంజూరు చేయాలని, విద్య,వైద్యం,ఉద్యోగ ఉపాధిలో మొదటి ప్రాధాన్యత గిరిజనులకుకల్పించాలని,ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలోముర్లజగపతి రెడ్డి,కెచ్చల సూరపరెడ్డి, కనుగులరవీంద్రారెడ్డి,వల్ల గణపతి రెడ్డి, కనుగుల శ్యామల వెంకట్ రెడ్డి,అందెల శ్రీరామ్,మూర్తిరెడ్డి,ముర్ల చిరంజీవి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఏడువారాల వెంకన్న నిత్య అన్నప్రసాదానికి లక్ష విరాళం

## వాడపల్లి క్షేత్రంలో వైభవంగా విశిష్ట పూజలు





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్27:**కోనసీమ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభను చాటుతున్న వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం విశిష్ట పూజా కార్యక్రమాలు ఎంతో భక్తి, శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఏడు వారాల నోములు నోసుకునే భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వసంత మండపంలో అష్టోత్తర శతనామ పూజ, నిత్య కళ్యాణం, హారతీ సేవలు అర్చకులు అతి వైభవంగా నిర్వహించారు. వేకువజామున ప్రారంభమైన కార్యక్రమాలు మద్యాహ్నం వరకు కొనసాగి, భక్తులను ఆధ్యాత్మిక ఆనందంతో నింపాయి.వందలాది మంది భక్తులు స్వామివారి సన్నిధికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం "గోవింద%ా% గోవింద%ా%" నినాదాలతో మార్మోగింది.స్వామివారి నిత్య అన్నదానాన్ని మరింతగా బలోపేతం చేయాలనే సంకల్పంతో హైదరాబాద్, ఎస్.ఆర్.నగర్‌కు చెందిన ఆవాల వెంకట సుబ్బారావు కుటుంబం సభ్యులు చి. ఆవాల శ్రీ వీర వెంకట లక్ష్మి,
ఇషాన్వి ం 1,00,116 రూ విరాళం అందించారు.ఈ సందర్భంగా ఆలయ పండితులు వేద మంత్రోత్సవాలతో కుటుంబ సభ్యులను ఘనంగా ఆశీర్వదించారు. అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

# ఆకట్టుకున్న అభి నృత్య ప్రదర్శన



**రాజమహేంద్రవరం,పెన్ పవర్ నవంబర్ 27:**సీతానగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో కూచిపూడి నాట్య అద్భుతమైన ప్రదర్శన చేసి అభి తన ప్రతిభను నిరూపిం చుకుందని, హిందూ ధర్మ రక్షక సమితి నాయకులు ఆకుల మణి కాంత్ తెలిపారు చిన్నతనం నుండే తన తల్లి దండ్రుల అభిరుచి మేరకు , గురువ ర్యులు శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షేత్రం నిర్వహికురాలు కళా తపశ్వి తణుకు సాయి మాదవి శిక్షణలో జాతీయ స్థాయిలో జరిగిన కూచిపూడి పోటిల్లో అభి తన ప్రతిభను నిరూ పించుకుంది. అభి గృహంలో తను సాధించిన మెమోంటోలు , సరిఫికెట్లు , మెడల్స్ స్వాగతం పలుకుతుంటాయి . పలువురు కితాబులతో అభిని అభినందించారు. తన నాట్య ప్రతిభ సాయి మాదవి కృషికి తార్కాణమని అభిని చెప్పటం విశేషం. నగర కేద్రంగా శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షేత్రం నిర్వహించడం అభిని కూచిపూడి నాట్యంలో పూర్తి స్థాయిలో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు సి హెచ్ వెంకట్ , భవానీ లను పలువురు గురువులు అభినందించారు.

అభి హిందూ ధర్మానికి ప్రతీకగా కూచిపూడి నాట్యం పట్ల ఆకర్షింపబడటం చిన్నతనం నుండి పిల్లల్లో హిందూ ధర్మ విలువలను, కూచిపూడి నాట్యం గొప్పతనాన్ని తెలియచేసే విధంగా పాఠశాలలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని. శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షత్రాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని ఇప్పటికే శ్రీమతి సాయి మాదవి సారథ్యంలో జాతీయ స్థాయిలోను, రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక పోటిల్లో గోల్డ్ మెడల్స్ , ప్రతిష్టాత్మకమైన మెమోంటోలు , సర్టిఫికెట్స్ సాధించిన ఖ్యాతి సాయి మాదవి సొంతం అభి తో పాటుగా ఎంతో మంది కూచిపూడి విద్యార్థులు ఈ కళా క్షేత్రంలో వారే కావడం ఎంతో గర్వంగా వుందని ప్రముఖులు సాయి మాదవి కృషిని ప్రశంసించారు.

# కల్యాణ మండపానికి భూమి పూజ

## కొత్తపేట నియోజకవర్గం జనసేన ఇన్చార్ బండారు శ్రీనివాస్..



**ఆలమూరు,పెన్ పవర్, నవంబర్ 27:**ఆలమూరు మండలంలోని సంధిపూడి గ్రామంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్యాణ మండపానికి కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ గురువారం భూమి పూజ చేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారంతో త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆకాక్షించారు. జనసేన మండల అధ్యక్షులు సురపరెడ్డి సత్య, చింతలూరు సొసైటీ అధ్యక్షులు నల్ల వెంకన్న, సర్పంచ్ లు తోట భవానీ వెంకటేశ్వర్లు,సంగిత సుభాష్, ఎంపీటీసీ తోలేటి సంతోషి, నల్లా వెంకన్న, సలాది రామకృష్ణ, తమ్మన భాస్కరరావు, గారపాటి త్రిమూర్తులు, చల్ల బాబి, దాసరి వీర పండు, కట్టా రాజు, కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## క్రిమి సమహారక మందులు వాడకం తగ్గించాలి

ఎమ్మెల్యే మద్దిపాటి




**గోపాలపురం, పెన్ పవర్, నవంబర్ 27.** క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా వాడడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని అసెంబ్లీ బడ్జెట్ ఎస్టిమేట్ కమిటీ సభ్యులు, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్ రాజు అన్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా గురువారం విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురుగు మందులు వాడినటువంటి ఆకు కూరగాయలు చిన్నపిల్లలు తినడం వల్ల ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. చిన్నపిల్లల శరీరంకు రోగాలను తట్టుకునే శక్తి ఉండదన్నారు. అలాగే బియ్యం ను మెరుగుపట్టి మరీ సన్నగా చేయడం వల్ల పైన ఉండే పొర మొత్తం పోయి వాటిలో ఏ రకమైన పోషకాలు ఉండవన్నారు. అన్ని రకాల ప్రజలకు ఆరోగ్యాన్ని చేకూర్చే విధంగా పంటలు పండించవలసి ఉందన్నారు. అయితే ఇందుకు సంబంధించి అధికారులు నివేదన తయారు చేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళవచ్చు అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ద్రాక్షారామంలో హుండీ లెక్కింపు - 43 రోజుల్లో రూ.43.95 లక్షల ఆదాయం



**రామచంద్రపురం/ద్రాక్షారామం, పెన్ పవర్,నవంబర్ 27:**శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈరోజు హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్ 15, 2025 నుండి నవంబర్ 27, 2025 వరకు 43 రోజుల వ్యవధిలో ఆలయ హుండీల ద్వారా రూ.43,95,359 ఆదాయం లభించినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని మీడియాకు తెలిపారు. అలాగే అన్నదాన హుండీ ద్వారా రూ.52,682 వచ్చినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి. సత్యనారాయణ పర్యవేక్షించారు. అలాగే ఓదురు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణా ధికారి విత్తనాల శ్రీనివాస్, గంగవరం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి వి. బాలకృష్ణ, అర్చకులు, ద్రాక్షారామ పోలీస్ శాఖ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది, సేవా సిబ్బంది, భక్తులతో పాటు ముప్పనపల్లి గణేష్, పెంకే సాంబశివ, ఆళ్ల బుజ్జి, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ, నవీన్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధర్మవరంలో పీవీసీ పైపుల తయారీ యూనిట్‌కు ముదునూరి మురళీకృష్ణం రాజు శుభారంభం





**ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 27 :**ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో పాండురంగ పీవీసీ పైపుల తయారీ ఇండస్ట్రీని నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు, వైసీపీ నేత ముదునూరి మురళీ కృష్ణం రాజు ప్రారంభించారు. జాతీయ రహదారి సమీపంలో దాట్ల రంగరాజు స్థాపించిన ఈ కొత్త యూనిట్ ప్రారంభోత్సవానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, భీమవరం ఎంపిపి పేరిచర్ల నరసింహరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలను ప్రారంభించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో పివిసి పైపుల తయారీ చేస్తోన్న పాండురంగ యూనిట్ మంచి వృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దెందుకూరి రామకృష్ణ రాజు, దాట్ల వంశీ రాజు, దాట్ల రోహిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చుకల పరిరక్షణకు ధాన్యపు కుంచెలు

### ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేయాలన్న హరిత వికాస్ ఫౌండేషన్




**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 27:** జిల్లాలోని ప్రతి విద్యార్థికి స్వయంగా ధాన్యం కుంచె తయారీ నేర్పించి పిచ్చుకల పరిరక్షణ ఉద్యమంలో వారిని భాగస్వాములను చేయాలని కోరుతూ, తునికి చెందిన హరిత వికాస్ ఫౌండేషన్ ఫౌండర్, విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు పి. దాలినాయుడు గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.పిచ్చుకల సంరక్షణకు హరిత వికాస్ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాల వివరాలను ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆయన వివరించారు.పర్యావరణం, జీవ వైవిధ్యం పట్ల చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో మంచి అవగాహన పెంపొందించడం ద్వారా బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. జీవ వైవిధ్యానికి, రైతులకు పిచ్చుకలు మరియు ఇతర పక్షులు అందించే ప్రయోజనాలను వివరించిన దాలినాయుడు మాష్టారు, పంటలకు హాని చేసే అనేక పురుగులను పక్షులు తినడం ద్వారా రైతులు పెద్ద మట్టుకు లాభపడుతారని చెప్పారు. పక్షులు విసర్జించిన విత్తనాల వల్ల కోట్లాది మొక్కలు సహజంగా పెరుగుతాయని పేర్కొన్నారు.వరికుంచెలు తయారీ ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధిలభిస్తుందని, ఒక ఎకరం పొలంలో ఏడాదికి ధాన్యం కుంచెలు తయారు చేసి అమ్మితే లక్ష రూపాయలకుపైగా ఆదాయం వస్తుందని చెప్పారు. ఉపాధి లేని కాలంలో మహిళలు నెలకి రూ.10,000 నుండి రూ.15,000 వరకు సంపాదించుకోవచ్చు అన్నారు. నిరుద్యోగ యువతకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా అవకాశాలు లభిస్తాయని వివరించారు.

రాబోయే మార్చి 20 ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ధాన్యం కుంచెలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ,హరిత వికాస్ ఫౌండేషన్ స్థాపకుడు పోలుపర్తి దాలినాయుడు మాష్టారు కలెక్టర్ షణ్మోహన్ కి వినతిపత్రం అందజేశారు.

## వేదిరేశ్వరం జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు





**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు27:**వేదిరేశ్వరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.మురళీకృష్ణ మాట్లాడుతూ 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదించబడిందని,అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు,సౌకర్యాలు కల్పించేలా రాజ్యాంగ రూపకల్పన చేసిన మహానుభావుడని తెలిపారు.సైన్స్ ఉపాధ్యాయులు సర్వా రాయుడు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా భారత ప్రజలందరికీ రాజ్యాంగ హక్కులు కల్పించారని,ఆ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొన్నారు.స్కూల్ చైర్మన్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధికి అంబేద్కర్ అమూల్యమైన సేవలు చేసారని, ఆర్టికల్ 14, 15, 16, 39%జ%, 42 వంటి రాజ్యాంగ అంశాల్లో మహిళా హక్కులకు ప్రత్యేక స్థానం కల్పించారని వివరించారు.విద్యార్థులు హృదయాకారంలో కూర్చోవడం ఎంతో ఆకర్షణీయంగా ఉందని,నేటి బాలికలు రేపటి సమాజ నిర్మాణకర్తలని చెప్పారు.తదుపరి ఫస్ట్ అసిస్టెంట్ ఎస్.రాంప్రసాద్ రాజ్యాంగ పీఠికను చదివి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కె.ఈశ్వర్ రెడ్డి, పి.ఇ.టి వై.ప్రసాద్, విశ్వనాథం, సాయి, సీతామహాలక్ష్మి, సుజిత, ప్రసన్న కుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## సంధిపూడిలో కాపు కల్యాణ మండపం పనులకు భూమిపూజ



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 27:**మండలంలోని సంధిపూడి గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపం నిర్మాణానికి గురువారం కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు,గ్రామస్తులు సహకారంతో మండపం నిర్మాణం పూర్తి చేసి నిరుపేదలు కల్యాణం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి,గ్రామ టిడిపి అధ్యక్షుడు సూరపురెడ్డి పట్టాభి రామయ్య, ప్రముఖ వ్యాపారవేత్త వట్టికూటి సతీష్, పినపళ్ళ సర్పంచ్ సంగిత సుభాష్,సోసైటి అధ్యక్షులు వంటిపల్లి సతీష్,నల్లా వెంకన్న, కొత్తపల్లి నగేష్,ఈదల నల్లబాబు, వైట్ల గంగరాజు,ఈదల రాంబాబు, మానేనల్లి శ్రీనివాస్, రామానుజుల శేషగిరిరావు, ముప్పరి వెర్రియ్య, వాసా కాశీ,పామర్తి ఆంజనేయులు, అంగర ఏసు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఫక్రుద్దీన్ పాలెంలో 'రైతన్న-మీకోసం' కార్యక్రమం: పంచసూత్రాలతో సాగు చేయాలని రైతులకు సూచనలు





**కాకినాడ, పెన్ పవర్ నవంబర్ 27:**జిల్లాలో జరుగుతున్న రైతన్న - మీకోసం కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు పిఠాపురం మండలం ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయకుమార్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయానికి ఇస్తున్న ప్రాముఖ్యతను వివరించి, ముఖ్యమంత్రి లేఖను రైతులకు అందజేశారు.రైతులు పంచసూత్రాలను అమలు చేస్తూ సాగులో ముందుకు సాగాలని జేడీ విజయ్ కుమార్ సూచించారు. నీటి భద్రత, మార్కెట్ గిరాకీ ఆధారంగా పంటల ఎంపిక, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగం, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రాధాన్యం, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు వంటి అంశాలను ఆయన స్పష్టంగా వివరించారు. వ్యవసాయం లాభసాటిగా మారేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్ పాలెం గ్రామ పంచాయతి అధ్యక్షుడు శేఖర్, పిఠాపురం ఏడీ స్వాతి, మండల వ్యవసాయ అధికారి గంగాధర్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భాగ్యరేఖ, రైతులు పాల్గొన్నారు.

## 1962 మొబైల్ వెటర్నరీ సేవలు ఎంతో కీలకం

ప్రభుత్వ ఐదు సూత్రాలు ప్రతి రైతు తెలుసుకోవాలని అదనపు డైరెక్టర్ డా. రాజని కుమారి



**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 27:** రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలు ప్రతి రైతు తెలిసి సద్వినియోగం చేసుకోవాలని అదనపు డైరెక్టర్ (హెల్త్) డా. ఎన్. రాజని కుమారి పిలుపునిచ్చారు. గురువారం ఆమె జాయింట్ డైరెక్టర్ డా. కృష్ణమూర్తి, డెప్యూటీ డైరెక్టర్ డా. అంబేద్కర్లతో కలిసి కాకినాడ అర్బన్ 1962 మొబైల్ వెటర్నరీ అంబ్యులేటరీ యూనిట్ను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ రాష్ట్ర స్థూల విలువ జోడింపులో కీలక పాత్ర పోషిస్తుందని, పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తి పెంపుతో పాడి రైతులకు అభివృద్ధి దిశగా కొత్త అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పశువుల ఆరోగ్య రక్షణలో 1962 మొబైల్ వెటర్నరీ సేవలు ఎంతో ముఖ్యమని, ఇవి రైతులకు సమయానుకూలంగా సేవలు అందిస్తూ ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పశువైద్య సేవలను సమర్థ వంతంగా అందిస్తున్న 1962 అంబులెన్స్ బృందాన్ని అధికారులు అభినందించారు. ఈ సందర్శనలో భాగంగా డా. బాల సువర్ణ, పారావెట్ బాలయోగి, పైలట్ శ్రీను (కాకినాడ అర్బన్)లను వారి అంకితభావ సేవలకు గాను సన్మానించారు.

# జగనన్న ప్రభల తీర్థానికి గుర్తింపు

బి. ఎన్. రావు ( నగేష్ బుర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

ఆంధ్రప్రదేశ్‌లో జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమ్మతి తెలిపారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాల్లో.. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఉత్సవానికి రాష్ట్ర పండుగగా ప్రకటిస్తే.. కోనసీమ ప్రాంత ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుంది.ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలలో జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ప్రత్యేక స్థానం ఉంది. వందల ఏళ్లుగా తెలుగు సంస్కృతికి చిహ్నంగా ఈ పండుగ నిలుస్తోంది. అయితే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబు సమ్మతించారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ మేరకు మలికిపురం గ్రామానికి వచ్చిన ఆయనకు స్థానికులు వినతిపత్రం అందించారు.స్థానికుల వినతిపై స్పందించిన మంత్రి దుర్గేష్.. లక్షల మంది భక్తుల కోలాహలం మధ్య ప్రతి సంవత్సరం వైభవంగా నిర్వహించే ఈ ప్రభల తీర్థానికి 450 సంవత్సరాల ఘనచరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ విషయంపై ఇప్పటికే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీనికి సీఎం చంద్రబాబు కూడా సమ్మతి తెలిపారన్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ఏటా సంక్రాంతి పర్వదినాల్లో.. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తారు. పంట కాలువల సవ్వడి నడుమ సంక్రాంతి కనుమ రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. దాదాపు 450 ఏళ్లు చరిత్ర కలిగిన ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని ప్రజలు ఎప్పటినుంచో ఆకాంక్షిస్తున్నారు. దేశం మొత్తంలో.. ఏకాదశరుద్రులు ఒకేచోట కొలువుతీరేది జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలోనే. రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన ప్రభలు అంబాజీపేట మండలంలోనే తయారు చేస్తారు.ఈ జగ్గన్నతోట ప్రభల ఉత్సవం విశిష్టత గురించి గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు రాసిన లేఖల ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ తెలుసుకున్నారు. అనంతరం ప్రధాని 2020లో తన సందేశాన్ని పంపించారు. 2023లో ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకలో జగ్గన్నతోట ప్రభల తీర్థం శకటాన్ని ప్రదర్శించారు. ఈ ప్రభల గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం. ఈ ఏడాది పర్యాటకశాఖ ఈవెంట్స్-ఫెస్టివల్ వెబ్‌సైట్‌లో ఈ ఉత్సవం చోటు దక్కించుకోవడం గమనార్హం. అంతేకాకుండా పదోతరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో.. జగ్గన్నతోట ప్రభల తీర్థం ప్రాధాన్యత, ప్రాచుర్యాన్ని వివరించారు.జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్రపండుగగా గుర్తిస్తే.. కోనసీమ ప్రాంతం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు దక్కుతుంది. పర్యాటకులు కూడా ఎక్కువ సంఖ్యలో రావడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇక రాష్ట్ర పండుగగా గుర్తిస్తే.. ఈ ఉత్సవం మరింత వైభవంగా జరపడానికి.. ఉత్సవానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. అంతేకాకుండా పదకొండు గ్రామాల్లో కొలువుదీరిన ఏకాదశ రుద్రుల ఆలయాలు మరింత అభివృద్ధి చెందుతాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు.. ఆలయాల వద్ద ప్రధానంగా తాగునీరు, వైద్యశిబిరాలు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయొచ్చు.

# తుపాన్‌గా బలపడిన సెన్యార్ తీవ్రవాయుగుండం..

బి. ఎన్. రావు ( నగేష్ బుర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక, హిందూ మహాసముద్రం మీదుగా అల్పపీడనం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర- వాయువ్య దిశగా కదులుతూ తీవ్రఅల్పపీడనంగా మారే అవకాశం ఉందంది. ఆ తదుపరి 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వివరించింది. మలక్కా జలసంధి ప్రాంతంలో సెన్యార్ తుపాన్ గా బలపడిన తీవ్రవాయుగుండం. ఈ తుపానుకు 'సెన్యార్'గా నామకరణం చేశారు. 24 గంటల తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. విశాఖపట్నం, కొనసీమ, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో 5 నుంచి 10 సెం.మీ. వర్షపాతం నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. తమిళనాడులో పలు జిల్లాలకు అలర్ట్ ప్రకటించారు. మలక్కా జలసంధి ప్రాంతాల్లో తీవ్రవాయుగుండం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ ఈరోజు తుపానుగా బలపడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని హెచ్చరించింది.అల్పపీడనం, తుపాను ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు (నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2) కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరి కోతలు జోరుగా సాగుతున్న క్రమంలో వెంటనే కుప్పలు వేసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ సూచించింది. పండిన ధాన్యాన్ని తడవకుండా భద్రపరచుకోవాలని, తడిసిన గింజలు మొలకెత్తకుండా, నాణ్యత కోల్పోకుండా జాగ్రత్త పడాలి సూచించింది. రంగుమారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలని అన్నదాతలకు సూచించింది.

# పార్లమెంటుకు అమరావతి బిల్లు...

బి. ఎన్. రావు ( నగేష్ బుర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

అమ రావతి రైతుల చిరకాల వాంఛ తీరనుంది. ఏపీ ప్రజల్లో ఉన్న అయోమయం తొలగనుంది. ఏపీకి అమరావతి శాశ్వత రాజధానిగా కేంద్రం గుర్తించనుంది. ఈ మేరకు డిసెంబర్ లో పార్లమెంటులో అమరావతి రాజధానిగా చట్టం చేయనున్నారు. చట్టబద్ధత కల్పించనున్నారు. గత అనుభవాల దృష్ట్యా భవిష్యత్తులో మరోసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చట్టబద్ధత కల్పించాలన్నది చాలా ఏళ్లుగా వినిపిస్తూ వస్తోంది. ఇప్పుడు ఏపీలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉండడం.. ఆపై కేంద్రంలో కీలక భాగస్వామి కావడంతో అమరావతికి చట్టబద్ధత అనేది సులువు అవుతోంది. దేశంలో ఏ రాష్ట్ర రాజధాని కీ లేని అరుదైన గౌరవం, ఆపై ఏకంగా చట్ట 'భద్రత' దొరకనుంది.నవ్యాంధ్రప్రదేశ్ కు టిడిపి తొలి ప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది. అయితే అటు తరువాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కారణాలతో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఆ సమయంలో మంత్రి బొత్స లాంటి సీనియర్ నేత కూడా అమరావతికి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదని.. అందుకే అమరావతిని మారుస్తున్నట్లు ప్రకటన చేశారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం సైతం ఈ విషయంలో కలుగజేసుకోలేదు. రాష్ట్రాల రాజధానుల ఏర్పాటు అనేది ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని.. అందులో కలుగజేసుకోలేమని ప్రకటించింది. టిడిపి తో బిజెపికి ఉన్న విభేదాలతోనే అలా ప్రకటన చేసిందని అంతా భావించారు. అయితే చాలా సందర్భాల్లో అమరావతిని రాజధానిగా కేంద్రం గుర్తించిందన్న ప్రకటన వచ్చేది అప్పట్లో. అంతకుమించి స్పాంతన ఉండేది కాదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి రాజధాని నిర్మాణ పనులు పున ప్రారంభం అయ్యాయి. కానీ అమరావతి పై అనుమానపు ఛాయలు అలానే ఉండిపోయాయి. జగన్ లాంటి మరో నేత వచ్చి అమరావతి కాదని వేరే రాజధాని ప్రకటిస్తారన్న అనుమానాలు కూడా ఉండిపోయాయి ప్రజల్లో. అందుకే ప్రజల్లో ఉన్న అయోమయాన్ని పోగొట్టాలని సిఆర్డిఏ అధికారులు కేంద్రాన్ని ఆశ్రయించారు. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని.. పార్లమెంటులో చర్చించి ఆమోదించాలని అటార్నీ జనరల్ వెంకటరమణను కోరారు. అయితే దేశంలో ఏ రాజధానికి కూడా గెజిట్ నోటిఫికేషన్ అనేది ఇవ్వలేదని.. అలా ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం లేదని.. అది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంపై ఆధారపడి ఉంటుందని చెప్పుకొచ్చారు.ప్రస్తుతం ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. అమరావతి విషయంలో చట్టబద్ధత కల్పించకపోతే వచ్చే ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లింది. ప్రజల్లో ఉన్న అయోమయం తొలగించడంతో పాటు భారీగా పెట్టుబడులు వస్తున్న దృష్ట్యా ఇన్వెస్టర్స్ లో నమ్మకం కోసమైనా అమరావతికి చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందని ఏపీ నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై అటార్నీ జనరల్ సైతం సంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక నోటు తయారు చేసి.. కేంద్ర క్యాబినెట్ కు పంపించారు. అక్కడ ఆమోదముద్ర వేసి న్యాయ శాఖకు వెళ్ళింది ఆ నోటు. అక్కడ కూడా అనేక రకాల అభ్యంతరాలు అధిగమించి ప్రస్తుతం హోం శాఖ పరిధిలో ఉంది. డిసెంబర్ లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అమరావతి బిల్లు చర్చకు రానుంది. తప్పనిసరిగా చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. నిజంగా ఇది అమరావతికి శుభపరిణామమే.

# టమోటా ధరలకు రెక్కలు

బి. ఎన్. రావు ( నగేష్ బుర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



టమోటా ధరలకు రెక్కలు వచ్చాయి. ఉన్న పళంగా బంగారం లాగానే ధరలు పెరుగుతున్నాయి. మదనపల్లి మార్కెట్ లో కిలో రూ. 63 టమోటా ధర తలుకుతుండగా గత పది రోజులుగా క్రమేణ పెరుగుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని పడమటి మండలాల్లో ప్రధాన ఆదాయ పంటగా టమోటా సాగు చేస్తున్న రైతులు ధర ఉన్న దిగుబడి లేక దిగాలు చెందుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మదనపల్లి,తంబళ్లపల్లి పుంగనూరు పలమనేరు నియోజకవర్గాల్లోనే దాదాపు 10 వేల హెక్టార్లలో టమోటా సాగు చేసిన రైతులు దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉంటుందని భావించారు. సీజన్ ముగుస్తున్న సమయంలో మొంథా తుఫాను, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దిగుబడి తగ్గింది. వర్షాల వల్ల చీడ పురుగులతో తెగుల్ల బెడద రైతులకు ఇబ్బందిగా మారడంతో పాటు దిగుబడి కూడా తగ్గేందుకు కారణమైంది.వర్షాల కారణంగా తేమశాతం అధికం కావడం, టమోటా మచ్చలు ఏర్పడడంతో పాటు పొలాల్లోనే కుళ్ళిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో దిగుబడిపై ప్రభావం పడటం వల్ల మదనపల్లి మార్కెట్ కు దిగుబడి తగ్గింది. గతేడాది ఇదే సమయంలో రోజు సగటున దాదాపు 700 మెట్రిక్ టన్నుల టమోటా మదనపల్లి మార్కెట్ కు రాగా ప్రస్తుతం 150 మెట్రిక్ టన్నులకు దిగుబడి పడిపోయింది. మదనపల్లి సరిహద్దున ఉండే కర్ణాటక ప్రాంతంలోని కోలారు, చింతామణి, ముల్బాగల్ ప్రాంతాల నుంచి కూడా ఆశించిన మేర మదనపల్లి మార్కెట్ కు టమోటా దిగుబడి కాకపోవడంతో ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.తగ్గట్టుగా మదనపల్లి మార్కెట్ లో టమోటా అందుబాటులో లేకపోవడం, మరోవైపు టమోటా కొనుగోలుకు బయట నుంచి ట్రేడర్లు కూడా ఆసక్తి చూపుతున్నడంతో మదనపల్లి మార్కెట్లో టమోటా కు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలోనే గత 10 రోజుల క్రితం రూ.10 పలికిన కిలో టమోటాధర ఇప్పుడు ఏకంగా రూ. 60 కు పైగానే ఉంటోంది. మొంథా తోపాటు వరుసతుఫానుల ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కారణంగా టమోటా ధరలు పెరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తగ్గిన దిగుబడి తో నిన్న మదనపల్లి మార్కెట్ కు వచ్చిన 140 మెట్రిక్ టన్నుల టమోటా రాగా మొదటి రకం కిలో టమోటా ధర రూ. 52 నుంచి రూ.63 వరకు పలుకగా రెండో రకం ధర రూ. 33 నుంచి 50 లు దాకా పలికింది. దీంతో ధరలు ఆశాజనకంగా ఉన్న దిగుబడి టమోటా సాగు చేసిన రైతులను పెరుగుతున్న ధరలు ఊరించని పరిస్థితి నెలకొంది.

# పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్లాన్

బి. ఎన్. రావు ( నగేష్ బుర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇంటర్మీడియట్ బోర్డు 'సంకల్ప్-2026' కార్యక్రమాన్ని చేపట్టింది. 50 రోజుల ప్రణాళికతో కూడిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్ బాషా విడుదల చేశారు. నవంబరు 24 నుంచి ఫిబ్రవరి 20 వరకు ఈ ప్రణాళిక అమలు చేయనున్నారు. సంకల్ప్ ప్రణాళిక ప్రకారం.. రోజూ ఉదయం 9.10 నుంచి 12.40 గంటల వరకు అన్ని సబ్జెక్టుల్లో బోధించని అంశాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రివిజన్, ఇతర టెస్ట్‌లు విద్యార్థులకు నిర్వహించాలి. డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు స్పెషల్ క్లాసులు ఉంటాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జూనియర్ కాలేజీల్లో ఈ ప్రణాళికను అమలు చేయాలని ఇంటర్ బోర్డు సూచించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026 మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు విద్యాశాఖ ఇటీవల షెడ్యూలు కూడా విడుదల చేసింది. షెడ్యూలు ప్రకారం పరీక్షలకు వంద రోజులు సమయం ఉంది. ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక, అక్కడ ఉన్న వసతులపై విద్యాశాఖాధికారులు పరిశీలన చేశారు. అవసరమైన చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈసారి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు గతంలో కన్నా ఈ ఏడాది నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించింది.ప్రతీరోజు తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి చదువుకోవాలి. ఏ సబ్జెక్టు అయినా రెండు లేదా మూడు భాగాలుగా విభజించుకోవాలి. పరీక్ష గడువు కాలాన్ని బట్టి కొంత సమయం రివిజన్‌కు కేటాయించి, మిగిలిన వాటిని పాఠ్యాంశాలు చదవడానికి కేటాయించాలి. రోజూ 20 నిమిషాల పాటు ధ్యానం చేయాలి. గత పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు చదివి సాధన చేయాలి. చదివిన ప్రశ్నలను చూడకుండా రాయాలి. వేగంగా రాసే విధానం అలవాటు చేసుకోవాలి. బిట్‌పేపరుపై నిర్లక్ష్యం వదిలి క్షుణ్ణంగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులతో చర్చిస్తూ అనుమానాలు నివృత్తి చేసుకోవాలి.. ఈ మేరకు కార్యచరణతో వంద రోజుల ప్రణాళికను అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని అధికారులు సూచించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

# చేతికొస్తున్నపంటలకు దక్కని మద్దతు ధరలు

బి. ఎన్. రావు ( నగేష్ బుర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పంట చేతికి వచ్చిన ప్రతీ సారి ఇబ్బంది పడుతున్నారు. మొదట తోతాపురి మామిడి కాయలకు డిమాండ్ లేక ఆందోళన చెందారు. తర్వాత ఉల్లి పంట పరిస్థితి అదే. ఇప్పుడు అరటి పంటలకూ డిమాండ్ ఉండటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో తోతాపురి మామిడి రైతులు ధరలు పడిపోవడంతో రూ.1,000 కోట్ల నష్టం చవిచూశారు. సెప్టెంబర్‌లో ఉల్లి ధరలు పడిపోయి, కర్నూల్, కడప జిల్లాల్లో రైతులు పంటను పారబోశారు. ఇప్పుడు అరటి పంటలకూ అదే పరిస్థితి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 18 ముఖ్య ఆహార పంటల్లో మామిడి, ఉల్లి, అరటి ప్రధానమైనవి. 2024-25లో మామిడి పంటలు అధిక ఉత్పత్తి ధర తగ్గుబాటు కారణంగా రైతులు భారీ నష్టం చవిచూశారు. ప్రభుత్వం కొంత సాయం చేసింది. సెప్టెంబర్‌లో ఉల్లి రైతులకు అదే సమస్య వచ్చింది.ఇప్పుడు అరటి రైతులు గగ్గోలు పెడుతున్నారు. డిమాండ్ , ఎగుమతులు తగ్గడం, లోకల్ మార్కెట్ స్థిరత్వం లేకపోవడం వల్ల ధర పడిపోయాయి. 2025లో ఆంధ్రలో హార్టికల్చర్ పంటలు 30 శాతం పెరిగింది. కానీ మద్దతు ధర విధానం సరిగ్గా లేకపోవడం వల్ల రైతులు లాభాలు పొందలేకపోతున్నారు. ఫలితంగా,

రైతుల ఆదాయం 40 శాతం తగ్గిందని చెబుతున్నారు. సెప్టెంబర్ 2025లో ధరల పతనంతో రూ.50,000/ హెక్టారుకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. - 24,000 మంది రైతులు ప్రయోజనం పొందారు. నవంబర్ 2025లో మార్కెట్ ధరలు మెరుగుపడ్డాయి. జూలై 2025లో కేంద్రం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ఆమోదించి తోతాపురి రైతులకు రూ.1,490 క్వింటాల్ మద్దతు ధర నిర్ణయించింది. రాష్ట్రం రూ.4 కేజీ సబ్సిడీ మొత్తం రూ.260 కోట్లు ఇచ్చింది. అక్టోబర్ 2025లో రూ.172.84 కోట్లు 37,881 మంది రైతుల అకౌంట్లలో జమ చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రైతులు ప్రధానంగా ప్రయోజనం పొందారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతు పథకాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

ప్రారంభించడం వంటి చర్యలు ప్రకటించింది. అరటి పంటలకు %మీరా% ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామనిప్రకటించారు. కానీ, ఇదంతా పేపర్ల మీదనే ఉన్నాయని రైతుల వరకూ వెళ్లడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతుంది. ఇన్‌పుట్ సబ్సిడీలు, కోల్డ్ స్టోరేజ్ సమస్యలు ఉండటంతో రైతులు మధ్యవర్తుల చేతిలో మోసపోతున్నారు. 2025లో హార్టికల్చర్ పంటలకు 1500 కోట్లు బడ్జెట్ కేటాయించినప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో అమలు జరగడం లేదు. పంటలు అనూహ్యంగా ఎక్కువగా పండటం వల్ల ఇతర చోట్ల డిమాండ్ తగ్గిపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం ఎంత సాయం చేసినా రైతులు మాత్రం నష్టపోతూనే ఉన్నారు.

# టీడీపీలో పంచాయితీలు

బి. ఎన్. రావు ( నగేష్ బుర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

తెలుగుదేశం పార్టీకి ఈసారి ఏంటో కానీ అధినాయకుడు ఒకవైపు లాగుతుంటే.. ఎమ్మెల్యేలు మరొక వైపు లాగుతున్నారు. ముఖ్యంగా ఈ టర్మ్ లో మాత్రం టీడీపీని దారుణంగా నష్టపరుస్తుంది ఖచ్చితంగా ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే. ఎందుకంటే గతంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావు. తమ నియోజకవర్గంలో ఏదైనా సమస్యలున్నా అధినాయకత్వంతో చెప్పుకునే వారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. నాయకత్వం మాట పెడచెవిన పెట్టి తాము అనుకున్నది మీడియా ముందు చెప్పేస్తున్నారు. దీంతో టీడీపీకి భారీగా డ్యామేజీ అవుతుంది. తాజాగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరద రాజులు రెడ్డి కూడా అలాంటి కోవలోకి వెళ్లినట్లే కనిపిస్తుంది. అసలే రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుందని వైసీపీ చేస్తున్న విమర్శలకు వరదరాజులు రెడ్డి వంత పాడినట్లుంది.. ప్రొద్దుటూరులో బంగారం వ్యాపారాలకు కొదవలేదు. బంగారం దుకాణాలు లెక్కకు మించి ఉన్నాయి. అయితే బంగారం వ్యాపారులను బెదరించి పోలీసులు ప్రయివేటు పంచాయతీలు చేస్తున్నారని సాక్షాత్తూ

ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి పోలీసులపై ఫైర్ అవ్వడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. రాజకీయం కోసం బంగారం వ్యాపారులకు అండగా ఉండటంలో తప్పులేదు. కానీ అదే సమంయంలో ప్రభుత్వంలో ఉన్న సమయంలో పోలీసులపై నెగిటివ్ కామెంట్స్ చేయడం ఇప్పుడు హాట్ హాట్ గా మారింది. బంగారు వ్యాపారి శ్రీనివాసులును అన్యాయంగా అరెస్ట్ చేశారని, ఏడు కోట్ల రూపాయల అప్పు వసూళ్లలో పోలీసులు ప్రమేయం ఉందని వరద రాజులు రెడ్డి చెప్పారు తమ విధులను మానేసి ప్రయివేటు పంచాయతీలు చేయడం, సివిల్స్ తగాదాల్లో తలదూర్చడమేంటని అధికార పార్టీ ఎమ్మెల్యేనే ప్రశ్నించడం ఇప్పుడు వైసీపీకి కలసి వచ్చింది. పోలీసుల వ్యవహార శైలిని టీడీపీ ఎమ్మెల్యేలే తప్పుపడుతున్నారంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. ఇక వైసీపీ సంగతి పక్కన పెడితే అసలు అధికారంలో ఉన్నప్పుడు ఏదైనా జరిగితే అది ఉన్నతాధికారుల దృష్టికో, జిల్లా ఇన్ ఛార్జి మంత్రికో చెప్పి పరిష్కరించుకోవాలని, లేకుంటే హైకమాండ్ ను సంప్రదించాలని, అంతేకాని ఇలా మీడియా సమావేశాలు పెట్టి పోలీసుల తీరును విమర్శించడం కేవలం హోం మంత్రిత్వ శాఖకు మాత్రమే కాదు...చంద్రబాబు సర్కార్ పైన కూడా పడుతుందన్నది ఈ పెద్దాయనకు తెలియదా? అంటే తెలుసు. ఎందుకు తెలియదు. అయినా అన్నారంటే డోన్ కేర్ అన్నమాటేగా.

# దీప్తి శర్మకు జాక్ పాట్.. గంటలోనే నలుగురు స్టార్ ప్లేయర్స్‌ను కొనేసిన యూపీ వారియర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్–2026 సీజన్ మెగా వేలం గురువారం (నవంబర్ 27) ఢిల్లీలో ప్రారంభమైంది. మెగా ఆక్షన్ కావడంతో స్టార్ ప్లేయర్స్ పై భారీ హైప్ నెలకొంది. మొత్తం 277 మంది ప్లేయర్స్ మెగా ఆక్షన్ లోకి వచ్చారు. ఇందులో 73 స్థానాల కోసం ప్లేయర్స్ పోటీ పడనున్నారు. 194 మంది భారత ప్లేయర్స్ ఉన్నారు. వీరిలో 52 మంది క్యాప్?డ్ ప్లేయర్స్ ఉండగా, 142 మంది అన్ క్యాప్?డ్ ప్లేయర్స్ ఉన్నారు. డబ్ల్యూపీఎల్ జట్లు ముంబై, బెంగుళూర్, గుజరాత్, ఢిల్లీ, యూపీ ఐదు ఫ్రాంచైజీలు తమ జట్టును పటిష్టం చేసుకోవడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటివరకు జరిగిన ఈ మెగా ఆక్షన్ లో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మకు భారీ ధర లభించింది. యూపీ వారియర్స్ ఈ ఆల్ రౌండర్ ను రూ. 3.2 కోట్లకు కొనుగోలు చేసింది. మెగా ఆక్షన్ కు ముందు ఉమెన్స్ వరల్డ్ కప్‌లో ఆల్‌రౌండ్ షో చూపెట్టిన దీప్తి శర్మకు విమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో నిరాశ ఎదురైంది. ఆమెను యూపీ వారియర్స్ రిటేన్ చేసుకోలేదు. మెగా టోర్నీలో దీప్తి 215 రన్స్, 22 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచింది. అలాగే గతేడాది డబ్ల్యూపీఎల్‌లోనూ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచినా ఫ్రాంచైజీ ఆమెపై కరుణ చూపలేదు. అయితే ప్రస్తుతం జరుగుతున్న మెగా ఆక్షన్ లో అదే జట్టు ఈ యూపీ ఆల్ రౌండర్ ను భారీ ధరకు కొనుగోలు చేయడం విశేషం. న్యూజిలాండ్ యంగ్ ఆల్ రౌండర్ అమేలియా కెర్ ను ముంబై ఇండియన్స్ రూ. 3 కోట్ల ధరకు సొంతం చేసుకుంది. కెర్ ను కూడా ముంబై రిలీజ్ చేసి ప్రస్తుతం జరుగుతున్న మెగా ఆక్షన్ లో భారీ ధరకు తీసుకుంది. ఇటీవలే బిగ్ బాష్ లీగ్ లో మెరుపు సెంచరీ చేసిన మెగ్ లానింగ్ ను 1.9 కోట్లకు యూపీ వారియర్స్ దక్కించుకుంది. కెప్టెన్ గా లానింగ్ వరుసగా మూడేళ్లు ఢిల్లీ జట్టును ఫైనల్ కు తీసుకెళ్లినా ఆమెను ఢిల్లీ రిలీజ్ చేసింది. భారత స్పిన్నర్ శ్రీ చరనికి మంచి ధర లభించింది. రూ. 1.3 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ ఈ ఆఫ్ స్పిన్నర్ ను దక్కించుకుంది.

సీనియర్ ప్లేయర్, గత సీజన్ లో ఆర్సీబీ జట్టుకు ఆడిన సోఫీ డివైన్ ను రూ. 2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ కొనుగోలు చేసింది. ఇంగ్లాండ్ స్టార్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ ను కూడా యూపీ వారియర్స్ దక్కించుకోవడం విశేషం. ఆస్ట్రేలియా ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ ను కూడా యూపీ వారియర్స్ దక్కించుకుంది. వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియాపై సెంచరీ కొట్టిన ఈ ఆసీస్ ఓపెనర్ ను రూ.1.2 కోట్లకు కొనుగోలు చేసింది.

# అప్పటివరకు హెడ్ కోచ్‌ను మార్చే ఆలోచన లేదు: గంభీర్‌కు బీసీసీఐ సపోర్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** స్వదేశంలో సౌతాఫ్రికాపై రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను టీమిండియా 0–2 తేడాతో కోల్పోయిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గంభీర్ భారత కోచ్ గా జట్టులోకి రావడంతోనే పరాజయాలు ఎక్కువయ్యాయని తీవ్రంగా తమ నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గౌహతి వేదికగా బుధవారం (నవంబర్ 26) జరిగిన రెండో టెస్టులో సౌతాఫ్రికా చేతిలో టీమిండియా 408 పరుగుల తేడాతో ఘోరంగా ఓడిపోవడంతో టీమిండియా టెస్ట్ భవిష్యత్ డైలమాలో పడింది. దీంతో గంభీర్ ను భారత జట్టు కోచ్ గా తొలగించాలనే డిమాండ్స్ వినిపించాయి. గంభీర్ కూడా తన భవిష్యత్ ను బీసీసీఐ నిర్ణయిస్తుందని షాకింగ్ కామెంట్స్ చేశాడు. తన పదవీకాలంలో సాధించిన విజయాలనూ గుర్తు పెట్టుకోవాలన్నాడు. గంభీర్ కామెంట్స్ పై బీసీసీఐ స్పందించింది. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ వైట్ వాష్ తర్వాత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌ను తొలగించే ప్రతిపాదనను తోసిపుచ్చింది. జట్టు పరివర్తన దశలో ఉన్నందున బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోవడానికి తొందరపడదని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. సెలెక్టర్లు, జట్టు మేనేజ్‌మెంట్‌తో బోర్డు చర్చలు జరుపుతుందని గంభీర్ ను తొలగించే ఆలోచన లేదని బీసీసీఐ అధికారి అన్నారు. బీసీసీఐ అధికారి మాట్లాడుతూ ఇలా అన్నారు.. "గంభీర్ విషయంలో బీసీసీఐ ఎటువంటి నిర్ణయం తీసుకోవడంలో తొందరపడదు. జట్టు పరివర్తన దశలో ఉంది. ప్రపంచ కప్ దగ్గర పడుతున్నందున ఇప్పుడు కోచ్ ను మార్చే ఉద్దేశ్యం లేదు. గంభీర్ తో ఒప్పందం 2027 ప్రపంచ కప్ వరకు ఉంది. ఆ తర్వాతే అతనిపై నిర్ణయం తీసుకుంటాం. సెలెక్టర్లు, జట్టు మేనేజ్‌మెంట్‌తో బీసీసీఐ మాట్లాడుతుంది". అని బీసీసీఐ అధికారి తెలిపారు.

**సిరీస్ ఓటమి తర్వాత గంభీర్ కామెంట్స్:**

"నా విషయంలో బీసీసీఐ నిర్ణయం తీసుకోవాలి. ఇండియా క్రికెట్ ముఖ్యం, నేను కాదని కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నప్పుడే చెప్పా. ఇప్పుడు కూడా అదే మాట చెబుతున్నా. ప్రజలు విజయాలను చాలా త్వరగా మర్చిపోతారు. ఎందుకంటే ఇంగ్లండ్‌లో యువ జట్టుతో ఫలితాలు సాధించిన వ్యక్తిని నేనేనన్న విషయం మర్చిపోయి కివీస్ చేతిలో వైట్‌వాష్‌ను గుర్తు పెట్టుకున్నారు. నేను చాంపియన్స్, ఆసియా ట్రోఫీని కూడా గెలిచిన వ్యక్తిని". అని గౌతీ గుర్తు చేశాడు.

**టెస్టుల్లో గంభీర్ కు బ్యాడ్ రికార్డ్:**

టీమిండియా హెడ్ కోచ్ గా గౌతమ్ గంభీర్ అడుగుపెట్టినప్పటి దగ్గర నుంచి భారత జట్టు టెస్టుల్లో విజయాల కోసం తీవ్రంగా శ్రమిస్తోంది. వైట్ బాల్ ఫార్మాట్ లో అదరగొట్టిన టెస్టుల్లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోతుంది. తాజాగా సౌతాఫ్రికాతో ముగిసిన రెండో టెస్టులో ఓటమి తర్వాత గంభీర్ పై విమర్శలు ఎక్కువయ్యాయి. ఇప్పటివరకు గంభీర్ కోచ్ గా భారత జట్టు ఆరు టెస్ట్ సిరీస్ లు ఆడింది. వీటిలో రెండు గెలిచి మూడు ఓడిపోయింది. ఇంగ్లాండ్ తో జరిగిన సిరీస్ సమమైంది. గెలిచిన రెండు సిరీస్ లు కూడా బలహీనమైన బంగ్లాదేశ్, వెస్టిండీస్ లపై కావడంతో గంభీర్ హెడ్ కోచ్ గా ఇప్పటివరకు విఫలమయ్యాడనే చెప్పాలి.

# డబ్ల్యూపీఎల్ వేలం: రూ.1.30 కోట్లు పలికిన తెలుగమ్మాయి శ్రీ చరణి




**హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ప్రీమియర్ లీగ్ 2026 మెగా వేలంలో తెలుగు తేజం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ స్పిన్నర్ శ్రీ చరణి సంచలనం సృష్టించింది. ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రూ. 1.30 కోట్లకు కొనుగోలు చేసింది. ఇది డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఆమెకు లభించిన అత్యధిక ధర కావడం విశేషం.గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఈ వేలంలో శ్రీ చరణి కోసం ఫ్రాంచైజీలు తీవ్రంగా పోటీ పడ్డాయి. ఆమె బేస్ ప్రైస్ రూ. 30 లక్షలు కాగా, ఢిల్లీ క్యాపిటల్స్, యూపీ వారియర్స్ మధ్య హోరాహోరీ బిడ్డింగ్ జరిగింది. చివరికి ఢిల్లీ ఆమెను దక్కించుకుంది. గత సీజన్‌లోనూ ఢిల్లీ తరఫున ఆడిన ఆమె, కేవలం రెండు మ్యాచ్‌లలో 4 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇదే ఆమె ధర భారీగా పెరగడానికి కారణమైంది.కడప జిల్లాకు చెందిన 21 ఏళ్ల శ్రీ చరణి ఇటీవల భారత జట్టు తరఫున వరల్డ్ కప్ టోర్నీలో 9 మ్యాచ్‌లలో 14 వికెట్లు పడగొట్టింది. కీలకమైన సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లలో ఆమె తన పొదుపైన బౌలింగ్ తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించింది. మరోవైపు, ఈ వేలంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమీలియా కెర్‌ను ముంబై ఇండియన్స్ రూ. 3 కోట్లకు కొనుగోలు చేయగా, సోఫీ డివైన్‌ను గుజరాత్ జెయింట్స్ రూ. 2 కోట్లకు సొంతం చేసుకుంది. అయితే, ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ అలిస్సా హీలీ తొలి రౌండ్‌లో అమ్ముడుపోకపోవడం ఆశ్చర్యం కలిగించింది.

# 'దంగల్' రికార్డులను టార్గెట్ చేసారా?

భారతీయ చిత్ర పరిశ్రమలో భారీ వసూళ్లు సాధించిన చిత్రమేది? అంటే అందరికీ గుర్తొచ్చేది %-%దంగల్%-%. అమీర్ ఖాన్ ప్రధాన పాత్రలో నితీష్ తివారీ తెరకెక్కించిన చిత్రం ఏకంగా 2000 కోట్ల వసూళ్లతో సరికొత్త రికార్డు సృష్టించింది. అదీ ఒకే భాగంగా రిలీజ్ అయి అన్ని కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇండియాలో వసూళ్ల కంటే? చైనా మార్కెట్ నుంచే 1300 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఇండియన్ మార్కెట్ నుంచి సాధించింది కేవలం 700 కోట్లు మాత్రమే. రెజ్లింగ్ నేథ్యంలో తెరకెక్కిన సినిమా కావడంతో చైనా ప్రేక్షకులు ఆ చిత్రానికి బ్రహ్మరధం పట్టారు.

**రికార్డులు తిరగ రాసేలా:**

ఇండియన్ బాక్సాపీస్ లెక్కల పరంగా చూస్తే %-%బాహుబలి%-, -%పుష్ప%-% లాంటి చిత్రాలు భారీ వసూళ్లు సాధించిన చిత్రాలుగా కనిపిస్తున్నాయి. వాటి సంగతి పక్కన బెడితే? 2000 కోట్ల రికార్డును తిరగరాసేది మళ్లీ నితీష్ తివారీనేనా అంటే? అవుననే అనాలి. ప్రస్తుతం రణబీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో ఇతిహాసం




%-%రామాయణాన్ని%-% రెండు భాగాలు గా తివారీ తెరకెక్కిస్తోన్న సంగి తెలిసిందే. ఈ సినిమా వందల కోట్లలో ఉంది. ఇప్పటికే మొదటి భాగం రామాయణం షూటింగ్ పూర్తయింది. వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా తొలి భాగం రిలీజ్ కానుంది.


**హాలీవుడ్ లో భారతీయ కథలు:**

మొదటి భాగానికి సంబంధించి పోస్ట్ ప్రడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ కథ కూడా విజువల్ ట్రీట్ గా హైలైట్ అవుతుందని నితీష్ చెప్పుకొచ్చాడు. రెండు సంవత్సరాల కష్టం రిలీజ్ అవుతుందని..తనకి కూడా లోలోపల టెన్షన్ ఉందన్నాడు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ స్టామినా ఎంత? 2000 కోట్ల వసూళ్లు రాబట్టే సత్తా ఉందా? అంటే అందుకు అవకాశాలు కనిసిస్తున్నాయి. %-%రామాయణం%-% అంటే భారత్ లోనే కాదు ప్రపంచ దేశాల్లోనూ ఎంతే క్రేజ్ ఉంది. భారతీయ చారిత్రాత్మక అంశాలను ఆధారంగా చేసుకునే హాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తున్నారు.

**మోదీ పర్యటనలు కలిసొచ్చేలా:**

అవతార్ కథలకు స్ఫూర్తి భారతీయ పుస్తకాలే. భాగవతం, మహాభారతం వంటి వాటికి ప్రపంచ దేశాల్లో ఎంతోప్రత్యే కత ఉంది. అందులోనూ రాముడు..సీత.. అంజనేయుడు.. లంకేశ్వరుడు కథ అంటే? ఎంతో ఆసక్తిగానూ ఉంటుంది. ఆ కథకు విజువల్ ట్రీట్ ఇస్తోన్న చిత్రం కావడంతో? ప్రపంచ దేశాల్లో రామాయణం భారీ ఎత్తున రిలీజ్ ప్లానింగ్ రెడీ అవుతోంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించే దేశాల్లో ప్రత్యేకంగా రిలీజ్ చేయనున్నారు. మోదీ అధికారంలోకి రావడంతో భారతీయ హిందు సంప్రదాయాలు మరింత విశ్వవ్యాప్తమయ్యాయి. అది కూడా ఈ సినిమాకు ప్రధానంగా కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. మరి ఈ అంచనాలను రామాయణం అందుకుంటుందా? లేదా? అన్నది చూడాలి.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com